ఉండిలో విధ్వంసం ఆపాలి

- పేదల ఇళ్లను కూలగొట్టిస్తున్న రఘురామ కృష్ణరాజు
- ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

2

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 272 | విజయవాడ, సోమవారం 5 మే 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 5 May 2025 | Rs

6

ఉత్కంఠ పోరులో కెకెఆర్ విజయం

వెంటనే జనగణన షెడ్యూలు ప్రకటించాలి

- పహల్గాం దాడి భద్రతా వైఫల్యమే
- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- వాణిజ్య చర్చలలో అమెరికా షరతులను అంగీకరించొద్దు
- సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో తీర్మానం

న్యూఢిల్లీ : పహల్గాంలో 26 మంది అమాయకుల ప్రాణాలను బలితీసుకున్న ఉగ్రదాడిని సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఈ దాడికి భద్రతా వైఫల్యమే కారణమని విమర్శించింది. హంతకులను శిక్షించేందుకు అన్ని ప్రయత్నాలు చేయాలని ప్రభుత్వానికి సూచించింది. పాక్‌పై సైనిక చర్య విషయంలో ఆచితూచి వ్యవహరించాలని కోరింది. జనగణన షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేసింది. వక్ఫ్ చట్టం వచ్చిన తర్వాత మైనారిటీలపై దాడులు పెరిగాయని, ముస్లింల ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. గవర్నర్ల అధికారాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచనను తప్పుపట్టింది.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని విజ్ఞప్తి చేసింది. అమెరికా విధించిన సుంకాల విషయంలో భారత ప్రభుత్వం అనుసరి స్తున్న లొంగుబాటు వైఖరిని ఎండగట్టింది. వాణిజ్య చర్చల సందర్భంగా అమెరికా విధించే షరతులకు తలొగ్గవద్దని హితవు పలికింది. బీహార్ శాసనసభ ఎన్నికలకు సన్నాహకంగా మహాగట్‌బంధన్ భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరుపుతున్నామని తెలిపింది.

సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో శనివారం న్యూఢిల్లీలో సమావేశమైంది. ఆ వివరాలతో ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. 26 మంది పర్యాటకుల ప్రాణాలను బలిగొన్న పహల్గాం ఉగ్రదాడిని పొలిట్‌బ్యూరో ఖండించింది. మృతుల కుటుంబాలకు సంతాప సూచకంగా నిమిషం పాటు మౌనం పాటించింది.

పహల్గాం ఉగ్రదాడిపై...

పహల్గాంలో 26 మందిని పొట్టన పెట్టుకున్న భయానకమైన ఉగ్రవాదుల దాడిని ఖండించేందుకు, విచారం వ్యక్తం చేసేందుకు దేశం యావత్తూ ఏకమైంది. హంతకులను శిక్షించేందుకు అన్ని ప్రయత్నాలు చేయాలి. పెద్ద భద్రతా లోపం కారణంగానే ఉగ్రదాడి జరిగింది. దీనిపై విచారణ జరిపి బాధ్యులను గుర్తించి పరిష్కార చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అత్యంత ముఖ్యమైన విషయమేమంటే కాశ్మీర్ ప్రజలు ఈ ఉగ్రదాడిని నిరసిస్తూ, ఖండిస్తూ ముందుకు వచ్చారు. లోయలో జన జీవనం స్తంభించింది. జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాద శక్తులను ఒంటరిని చేయడానికి ప్రజలందరూ ఏకతాటి పైకి వచ్చారు. ఉగ్రవాదుల ఇళ్లు కూల్చడం వంటి చర్యలు చేపట్టకూడదు. ఎందుకంటే అవి అమాయక కుటుంబాలపై ప్రభావం చూపుతాయి. ప్రజలను దూరం చేస్తాయి.

ముస్లింలు, కాశ్మీరీలపై సామాజిక మాధ్యమాలలో జరుగుతున్న ద్వేష పూరిత ప్రచారాన్ని, పౌరులపై జరుగుతున్న వ్యక్తిగత దాడులను పొలిట్‌బ్యూరో ఖండించింది. ఇలాంటి మతోన్మాద శక్తులు ప్రజలను విడదీయాలన్న ఉగ్రవాద లక్ష్యానికి ఊతం ఇవ్వడానికి మాత్రమే దోహదపడతాయి. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద సంస్థలను అణచివేయడానికి ప్రభుత్వం కొన్ని దౌత్యపరమైన చర్యలు తీసుకుంది. దాడికి పాల్పడిన వారిని, కుట్రదారులను గుర్తించి అంతర్జాతీయ సమాజం ముందు నిలబెట్టడానికి ప్రభుత్వం ఓ పత్రాన్ని రూపొందించాలి. అవసరమైన జోక్యం చేసుకోవడానికి మిగతా 2లో

వర్ష బీభత్సం

:గుంటూరు జిల్లా తాడేపల్లిలో నేలకొరిగిన అరటి పంట

- కూలిపోయిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్‌లు
- ఐదుగురు మృతి
- మామిడి, అరటి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఆదివారం భారీ వర్షాలు, ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్‌లు కూలిపోయాయి. కృష్ణా, కోనసీమ జిల్లాల్లో ధాన్యం రాశులు తడిచిపోయాయి. పలు జిల్లాలో మామిడి కాయలు నేలరాలాయి. అరటి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. కుండపోత వర్షానికి విజయవాడ నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమ్యాయి. ముందు జాగ్రత్త చర్యగా అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పలు ప్రాంతాల్లో వర్షాలకు చెట్టు కొమ్మలు, విద్యుత్ స్తంభాలు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఐదుగురు మృతి చెందారు.

కృష్ణా జిల్లా పెనమలూరు మండలం చోడవరంలో భారీ గాలులకు పట్టాలు ఎగిరిపోవడంతో మొక్కజొన్న, ధాన్యం బస్తాలు తడిచిపోయాయి. గొల్లనపల్లి, చిక్కవరం, వీరపనేనిగూడెం, పురుషోత్తపట్నం, సూరంపల్లి గ్రామాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. కంకిపాడు, ఉయ్యూరుల్లో చెట్లు కూలిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఉయ్యూరులో మొక్కజొన్న, అరటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎన్‌టిఆర్ జిల్లా పుల్లూరు, తదితర ప్రాంతాల్లో ఆరబోసిన ధాన్యం రాశులు తడిచిపోయాయి. కోతకొచ్చిన మామిడికాయలు నేలరాలాయి. ఇబ్రహీంపట్నం జూపూడి నుండి కోటికలపూడి గ్రామాల మధ్యలో ఆరబెట్టిన మొక్కజొన్న తడిసింది. కూరగాయ తోటలు, అరటి తోటలు దెబ్బతిన్నాయి. విజయవాడ నగరంలో జనజీవనం స్తంభించింది. 14.78 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముందస్తు జాగ్రత్తగా ఇంద్రకీలాద్రిపై రాకపోకలు నిలిపివేశారు. కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, జిల్లాల్లో పలుచోట్ల ధాన్యం రాశులు వర్షానికి తీడిసిపోయాయి. సామర్లకోట రైల్వే స్టేషన్ ఎదురుగా కెనాల్ రోడ్‌లో వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాజులూరులో భారీ ఈదురుగాలులకు మామిడి, అరటి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది.

ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలో గాలివాన బీభత్సానికి కొమ్మర, కోడిగూడెం, రాళ్లకుంట గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలిపోయాయి. సానారుద్రవరం, కోరుకొల్లు మధ్య చెట్టు కొమ్మలు విరిగి పడడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో ధాన్యం రాశులు తడిచిపోయాయి. మార్టేరు-ఆచంట ప్రధాన రహదారి నీట మునిగింది. ఆచంట రామేశ్వరస్వామి ఆలయం వెనుకనున్న భారీ వృక్షం నేలకొరిగింది. వీరవాసరంలో ధాన్యం తడిసిపోయింది. ఉండిలో భారీ వర్షానికి చెట్లు, కరెంటు, స్తంభాలు, సెల్ టవర్ నేలకూలాయి. విద్యుత్ సరఫరా నిల్చిపోవడం, సెల్ సిగ్నల్స్ పని చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంటూరు జిల్లా తాడేపల్లి, మంగళగిరిలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పార్వతీపురం మన్యం జిల్లాలో విస్తృత వర్షాలు, ఈదురు గాలుల వల్ల అక్కడక్కడా రహదారి పక్క చెట్లు విరిగిపడ్డాయి. దీంతో, రాకపోకలకు, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అల్లూరి జిల్లా అరకులోయ, డుంబ్రిగుడ, జికె.వీధి మండలాల్లో వర్షం కురిసింది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో చిరుజల్లులు పడ్డాయి. తిరుపతి జిల్లా మిగతా 2లో

నేడు పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్

రాష్ట్రంలో పలు జిల్లాలకు విపత్తుల నిర్వహణ సంస్థ రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లను ప్రకటించింది. రెడ్ అలర్ట్ ప్రకటించిన జిల్లాల్లో ప్రకాశం, కృష్ణా, బాపట్ల, నెల్లూరు, తిరుపతి జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాల్లో గంటకు 60 నుంచి 85 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే, పిడుగులు పడే అవకాశం ఉంది. ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిన జాబితాలో అల్లూరి సీతారామరాజు, విజయనగరం, అనకాపల్లి ఉన్నాయి. ఈ జిల్లాల్లో పిడుగుల కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. విశాఖ, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. హోర్డింగ్స్, చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిలబడరాదని, ముందస్తుగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ సూచించారు.

విజయవాడలో ఏర్పాటు చేసిన ఒక పరీక్షా కేంద్రం వద్ద నీట్ అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు

నీట్ ప్రశాంతం

రాష్ట్రంలో 70 వేల మంది హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య విద్యాకోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) ఆదివారం ప్రశాంతంగా జరిగింది. దేశవ్యాప్తంగా 22.7 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 566 నగరాల్లో సుమారు 5,400 పరీక్ష కేంద్రాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో సుమారు 70 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. రాష్ట్రంలో 28 నగరాల్లో సుమారు 150 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగింది. నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను లోపలికి అనుమతించ లేదు.

పరీక్షా కేంద్రాల వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసి విద్యార్థులను లోపలికి పంపించారు. థెర్మోడైనమిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్ వంటి టాపిక్స్ నుంచి ప్రశ్నలు ఎక్కువగా వచ్చాయని, దీనివల్ల లెక్కలతో సమయం ఎక్కువగా తీసుకున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు.

పరీక్ష ఆన్సర్ 'కీ'ని ఈ నెల చివరి లో ఎన్‌టిఎ విడుదల చేసే అవకాశం ఉంది. జూన్ 14న ఫలితాలు విడుదలయ్యే అవకాశం ఉంది. ఆన్సర్ కీ, ఫలితాలను అభ్యర్థులు www.nta.ac.in, https://neet.nta.nic.in ద్వారా తెలుసుకోవచ్చు.

పాఠశాలల ప్రారంభానికి ముందే తల్లికి వందనం

- ఈ నెలలోనే అన్నదాతా సుఖీభవ
- 27 నుంచి కడపలో మహానాడు
- టిడిపి నేతలతో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాలల ప్రారంభానికి ముందే తల్లికి వందనం కింద చదువుకునే పిల్లలకు రూ.15 వేలు అందిస్తామని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. ఈ నెలలోనే అన్నదాతా సుఖీభవ పథకాన్ని కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు. టిడిపి ఎంపిలు, ఎమ్మెల్యేలు, పార్టీ కార్యవర్గంతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూపర్-6 హామీలు అమలు చేయడంతో పాటు ఆర్థిక, ఆర్థికేతర అంశాలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చి జూన్ 12 నాటికి ఏడాది పూర్తవుతుందని, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మిగిలిన నామినేటెడ్ పోస్టులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. అమరావతి రాజధాని పనుల పున:ప్రారంభ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన కార్యకర్తలు, నేతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంతో దేశం, ప్రపంచం దృష్టి అమరావతిపై మళ్లిందని చెప్పారు. అమరావతి ఆవశ్యకతను తెలియజేసేందుకు, పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రధాని చేతుల మీదుగా పున:ప్రారంభం చేశామని, వికసిత్ భారత్-2047కు బలమైన పునాదిగా మారుతుందన్నారు. అమరావతి నిర్మాణం ఇక ఇబ్బందులు లేకుండా ముందుకెళ్తుందని చెప్పారు. పోలవరానికి నిధులు రాబట్టి 2027 నాటికి పూర్తి చేసే లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు ఊపిరిపోసి రూ.11,400 కోట్లు కేంద్రం నిధులు కేటాయించేలా చేసుకున్నామని, ఉత్తరాంధ్ర వాసుల కల అయిన రైల్వేజోన్ సాధించామన్నారు. ఇటీవల 11 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు ప్రారంభించామని, త్వరలోనే మిగిలిన వాటిల్లో కూడా ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీ సంస్థాగత ఎన్నికలు కూడా నిర్వహించుకుంటున్నామని, రాష్ట్ర కమిటీలు మినహా అన్ని కమిటీలు మే 18 నాటికి పూర్తి చేయాలని చెప్పారు. పార్టీ మహానాడును ఈ నెల 27, 28, 29 తేదీల్లో మిగతా 2లో

రాజ్యసభలో సిపిఎం పక్ష నేతగా జాన్‌బ్రిట్టాస్

న్యూఢిల్లీ : రాజ్యసభలో సిపిఎం పక్ష నేతగా జాన్ బ్రిట్టాస్ ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన రాజ్యసభలో సిపిఎం డిప్యూటీ లీడర్‌గా ఉన్నారు. రెండుసార్లు ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు పొందారు. బ్రిట్టాస్ విదేశీ వ్యవహారాల స్టాండింగ్ కమిటీ, పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ, ఐటిశాఖ అడ్వయిజరీ కమిటీలలో సభ్యుడుగా ఉన్నారు. మీడియా రంగంలోనూ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకూ రాజ్యసభా పక్ష నేతగా ఉన్న బికాస్ రంజన్ భట్టాచార్య రిలీవ్ కావడంతో ఆ బాధ్యతలను బ్రిట్టాస్ చేపట్టనున్నారు.

ప్రధాని మోడీతో ఎయిర్ చీఫ్ మార్షల్ భేటీ

భారత్ - పాక్ ఉద్రిక్తతలపై చర్చ

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో ఆదివారం వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి సింగ్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పహల్గాం ఉగ్రదాడి కారణంగా భారత్ - పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలపై చర్చించినట్లు సమాచారం. ఎయిర్ చీఫ్ మార్షల్, ప్రధాని మధ్య సమావేశం జరిగినట్లు సంబంధిత అధికారులు ధ్రువీకరించారు. మరింత సమాచారం ఇవ్వడానికి అధికారులు నిరాకరించారు. శనివారం భారత నౌకాదళ అధిపతి నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి ప్రధానమంత్రితో సమావేశమైన సంగతి తెలిసిందే. ఆయనతో సమావేశం జరిగిన 24 గంటల వ్యవధిలోనే వైమానిక దళాధిపతితో కూడా ప్రధాని సమావేశం కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇక గతవారంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదితో మోడీ సమావేశమయ్యారు.

ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది మరణించిన తరువాత ఈ దాడిలో పాల్గొన్న వారిని కఠినంగా శిక్షిస్తామని భారత్ హెచ్చరించింది. ఏప్రిల్ 29న అత్యున్నత రక్షణాధికారులతో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో మోడీ మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందన విధానం, లక్ష్యాలు, కాల వ్యవధి నిర్ణయించుకోవడంలో సాయుధ దళాలకు 'పూర్తి కార్యాచరణ స్వేచ్ఛ'ను ప్రకటించారు. వీటితో పాటు సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం, అట్టారి వద్ద అంతర్జాతీయ క్రాసింగ్‌ను మూసివేయడం, దౌత్య సంబంధాలను తగ్గించడం వంటి చర్యలనూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

పల్నాడులో హైటెన్షన్

- వెల్దుర్తిలో కార్డన్ సెర్చ్
- భారీగా మారణాయుధాలు స్వాధీనం

3

పాఠశాలలను మూసేస్తే ఉద్యమం

- 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలి
- ఉద్యోగోన్నతులు, బదిలీలు త్వరగా పూర్తి చేయాలి
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు

రక్తమోడిన రహదారి

- ఒంగోలులో సమీప ప్రాంతాల్లో 3 రోడ్డు ప్రమాదాలు
- ఐదుగురు మృత్యువాత

బోల్తా పడిన కోడి గుడ్ల లారీ

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా ఒంగోలులో 16వ నెంబర్ జాతీయ రహదారి రక్తమోడింది. కొప్పోలు సమీపంలోని జాతీయ రహదారిపై సమీపప్రాంతాల్లో జరిగిన మూడు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృత్యువాత పడ్డారు. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం వేకువజామున 4.50 గంటలకు జాతీయ రహదారిపై ఒక లారీకి పంక్చర్ కావడంతో రోడ్డుకి కుడివైపున డ్రైవర్ లారీని ఆపారు. పంక్చర్ వేసుకొని బయలుదేరుతుండగా తెలంగాణ రాష్ట్రం భువనగిరి నుంచి నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడుకి కోడిగుడ్ల లోడుతో వెళ్తున్న లారీ వెనుక నుంచి ఆ లారీని ఢీకొట్టింది. వెనుకనే హార్వెస్టర్ యంత్రాన్ని తీసుకెళ్తున్న వ్యాన్... కోడిగుడ్ల లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కోడిగుడ్ల లారీ తిరగబడి నెల్లూరు నగరానికి చెందిన డ్రైవర్ షేక్ రహీం అలియాస్ రమణయ్య (60), నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడుకి చెందిన క్లీనర్లు రావినూతల బాబు (42), రావినూతల నాగేంద్ర (20) మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదం జరిగిన మరో పది నిమిషాలకు అదే మార్గంలో 500 మీటర్ల దూరంలో వ్యతిరేక దిశలో ఓ ఇటుకల ట్రాక్టర్ వస్తుండగా ఓ వ్యాన్ ముందు నుంచి ఢీకొట్టింది. ఈ వ్యాన్‌ను వెనుక వస్తున్న మరో కారు ఢీకొనడంతో ఈ మూడు వాహనాల డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. మరో 15 నిమిషాలకు ఇదే మార్గంలో ప్రయాణిస్తున్న ఓ లారీ డ్రైవర్ ఈ ప్రమాదాన్ని చూసి బ్రేక్ వేయగా.. దీనికి వెనుక వస్తున్న కారును స్లో చేయగా, నాగాలాండ్ నుంచి చెన్నై పోర్టుకి వెళుతున్న కంటెయినర్ వేగంగా వచ్చి ఆ కారును బలంగా ఢీకొట్టింది. దీంతో, లారీకి, కంటైనర్‌కు మధ్య కారు ఇరుక్కొని నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరుకు చెందిన తిరుమలశెట్టి పావని (35), తిరుమలశెట్టి చంద్ర కౌశిక్ (14) మృతి చెందారు. తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు, బూసి వినయ్, బూసి లావణ్య, బాలుడు లోక్షిత్‌కు గాయాలయ్యాయి. వీరిని ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. వీరిలో వినయ్ తలకు బలమైన గాయం తగలడంతో ఆపరేషన్ అవసరమని వైద్యులు సూచించారు. లావణ్య వెన్నెముకకు గాయాలు కావటంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. సంఘటనా స్థలాలను ఎస్‌పి ఎఆర్ దామోదర్, ఎఎస్‌పి కె.నాగేశ్వరరావు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆర్.సుశీల, ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు పరిశీలించి ప్రమాదాలు జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఒంగోలు తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కడపలో నిరసన ప్రదర్శన

కర్నూలు ధర్నాలో మాట్లాడుతున్న అవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎ.సుభాన్

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు

- పార్టీలకు అతీతంగా పాల్గొన్న నేతలు

ప్రజాశక్తి - కడప (వైఎస్ఆర్‌జిల్లా), కర్నూలు జిల్లా కార్పొరేషన్

వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కడప, కర్నూలు జిల్లాలో భారీ ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఆల్‌ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొని తమ నిరసన తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కడపలో గౌస్ నగర్ నుంచి మాసాపేట సర్కిల్, పెద్ద దర్గా శివలింగం బీడీ ఫ్యాక్టరీ (టిప్పు సుల్తాన్) ఆల్మాస్‌పేట సర్కిల్, పొట్టి శ్రీరాములు సర్కిల్ మీదుగా సెవెన్ రోడ్ సర్కిల్ వరకు లాంగ్ మార్చ్ నిర్వహించారు. అక్కడ జరిగిన సభలో కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా మాట్లాడారు. ఈ చట్టంలో అనేక లోపాలున్నాయని, వాటిని సవరణ చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్పీర్, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యులు, ముస్లిం జెఎసి నాయకులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ బర్తరఫ్ చేయాలి : ఆవాజ్

ముస్లిములను ఉగ్రవాదులని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కర్నూలు జిల్లాలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో అవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎ సుభాన్ మాట్లాడుతూ మతాల మధ్య చిచ్చుపెడుతున్న పవన్ కల్యాణ్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సిఎం స్థాయిలో ఉన్న వ్యక్తి ఒక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడడం దారుణమన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే ప్రమాదకారిగా ఆయన కనబడుతున్నారని విమర్శించారు. పవన్ కల్యాణ్ తన నోటిని అదుపులో ఉంచుకోవాలని, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని తక్షణమే ముస్లిం సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రిటైర్డ్ ప్రిన్సిపల్ నిసార్ అహ్మద్, కెవిపిఎస్ నగర కార్యదర్శి గురుస్వామి, అవాజ్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ విజయవంతం

- సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బలమైన గాలులు, వర్షం కారణంగా కలిగిన విద్యుత్ సరఫరా అంతరాయాలను విద్యుత్ పంపిణీ సంస్థలు త్వరితగతిన పూర్తిచేసి విజయవంతంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేశాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ సిఎమ్‌డి నుంచి లైన్‌మ్యాన్ వరకు అప్రమత్తంగా ఉంటూ రికార్డు సమయంలోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని పేర్కొన్నారు. విద్యుత్ సంస్థల అధికారులతో వర్చువల్‌గా ఆదివారం సమీక్ష సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో అనిశ్చిత వాతావరణ పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉండటంతో విద్యుత్ సంస్థలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పునరుద్ధరణ పనులు పూర్తికాని ప్రాంతాల్లో కీలకమైన సేవలు నిలిపివేయకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ముఖ్యమైన సేవలకు ముఖ్యంగా తాగునీటి సరఫరా వంటి సేవలకు సరఫరా నిరంతరాయంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తినా, అధికారిక హెల్ప్‌లైన్లు, స్థానిక సబ్‌స్టేషన్‌లకు తెలియజేయాలని చెప్పారు. ప్రజలు విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పునరుద్ధరణ పనులు చేస్తున్న సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండటమే కాకుండా అవసరమైన అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎపిసిపిడిసిఎల్, ఎపిఇపిడిసిఎల్, ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డిలు ఎకెవి భాస్కర్, ఐ పృథ్వీతేజ్, కె సంతోషరావు వారి డిస్కంల పరిధిలో జరిగిన పనుల గురించి వివరించారు.

ఉండిలో విధ్వంసం ఆపాలి

- పేదల ఇళ్లను కూలగొట్టిస్తున్న రఘురామ కృష్ణరాజు
- ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశ్చిమగోదావరి జిల్లా, ఉండి నియోజకవర్గంలో జరుగుతున్న విధ్వంసం ఆపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం లేఖ రాశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కె రఘురామ కృష్ణరాజు ఆదేశాలు, ప్రోద్భలంతో పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లను, చిన్న దుకాణాలను బుల్డోజర్లతో తొలగిస్తున్నారని తెలిపారు. పాలకోడేరు అల్లూరి సీతారామరాజు నగర్ పేదలపై, మహిళలపై మగ పోలీసుల బలప్రయోగాన్ని ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. ఆకివీడు మండలంలో 355 ఇళ్లను, పాలకోడేరు మండలంలో 165, కాళ్ల మండలంలో 100 మొత్తం 700కు పైగా పేదల ఇళ్లను, ఉండిలో చిన్న దుకాణాలను అక్రమంగా కూల్చేశారని తెలిపారు.

ఇంకా పెద్దసంఖ్యలో కూల్చడానికి పేద ప్రజలకు నోటీసులు కూడా ఇచ్చారని, ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన వాటిని సైతం మే 15లోగా అన్ని ఇళ్లు కూల్చేస్తామని బహిరంగంగా ప్రకటించారని వివరించారు. ఇది చాలా అన్యాయమని, అమానుషమని, అందరికీ ఇళ్లు ఇస్తామని చెబుతున్న ప్రభుత్వ నిర్ణయానికి, స్ఫూర్తికి పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు. తమకు పట్టాలు వస్తాయని ఆశించిన ప్రజల ఇళ్లను అక్రమంగా కూలగొట్టిస్తున్నారని తెలిపారు. కొందరు భూస్వాముల భూముల కోసం, వారి భూముల విలువను పెంచడం కోసం, రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూములను వారికి అప్పగించేందుకు నిరుపేదల ఇళ్లను కూల్చేస్తున్నారని తెలిపారు. ప్రజలు నిరసిస్తూ ప్రతిఘటిస్తున్నా, పేదలను, వారికి అండగా ఉన్న నాయకులను పోలీసులు గృహ నిర్బంధాలు, అక్రమ అరెస్టులు, అక్రమ కేసులతో ఇబ్బందులు పెడుతున్నారని వెల్లడించారు. కొందరికి మాత్రమే స్థలాలిచ్చి అందరికీ స్థలాలు ఇచ్చేసి ప్రత్యామ్నాయం చూపించే ఇళ్లు తొలగిస్తున్నామని పేదలపై అబద్ధపు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కొందరికి స్థలాలిచ్చినా ఇచ్చిన చోట నిర్మాణానికి అనువుగా లేదని వెల్లడించారు. ఇళ్లను కూల్చేసే సమయంలో పోలీసులు చాలా దురుసుగా, అమానుషంగా ప్రవర్తించి భౌతికదాడి చెయ్యడంతో ఒక మహిళకు తలకు తీవ్ర గాయమై ఆస్పత్రి పాలయ్యారని పేర్కొన్నారు. ఇళ్లను తొలగిస్తామని అధికారులు చెప్పడంతో మెట్ట లక్ష్మి గుండెపోటుతో చనిపోయారని పేర్కొన్నారు. అయినా ఆమె పేరుతోనే అధికారులు మరలా నోటీసులు ఇచ్చారని వివరించారు. ప్రభుత్వం చెబుతున్న పి4 ఉండి నియోజకవర్గంలో రివర్స్‌లో అమలు జరుగుతోందని పేర్కొన్నారు. పెద్దల నుండి పేదలకు సహాయం కాకుండా పేదలను వెళ్లగొట్టి పెద్దలకు కట్టబెట్టే ప్రయత్నంలా ఉందని విమర్శించారు. కాలుష్యానికి కొన్ని ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఇతర పరిశ్రమలు కారణమని పలు అధ్యయన రిపోర్టులు నిర్ధారించాయని తెలిపారు. వీరి జోలికి మాత్రం పోకుండా కాలుష్య నివాస ప్రాంతంలో నివసిస్తున్న పేద ప్రజలే కారణమంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

ఈ కింది చర్యలు తక్షణమే తీసుకోవాలి

1. ఇళ్ల తొలగింపు తక్షణం ఆపి, ఇచ్చిన నోటీసులు ఉపసంహరించుకోవాలి. ఇళ్లకు పట్టాలు ఇవ్వాలి. తొలగించిన ఇళ్ల వారికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం వాగ్దానం చేసిన విధంగా గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. లేదా ప్రతి కుటుంబానికి ఇల్లు నిర్మించుకోడానికి రూ.5 లక్షలు సహాయం చేయాలి.
2. భూస్వాములు అక్రమంగా అనుభవిస్తున్న భూమి, కొబ్బరి చెట్లు స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలి. బడా వ్యక్తుల అక్రమ ఆక్రమణలు, భవనాలు తొలగించాలి.
3. కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించి ఇళ్లు తొలగించిన రెవెన్యూ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇటువంటి కోర్టు ఉల్లంఘన చర్యలు జరగకుండా చూడాలి. పేదలకు సంబంధించి ఒక ప్రాంతంలో కోర్టు స్టే కొందరికి వస్తే అది అదే సమస్య స్వభావం ఉన్న ఆ ప్రాంత వాసులందరికీ వర్తించే సహజ న్యాయ స్వభావ సూత్రంగా చూడాలి.
4 'స్త్రీలపై చేయిచేసుకున్న మగ పోలీసులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి. పేదలపై, నాయకులపై పెట్టిన కేసులు ఎత్తివేసి, నిర్బంధం ఆపాలి.
5. ఈ తొలగింపుల ప్రక్రియలో హఠాత్తుగా తీవ్ర అనారోగ్యానికి గురై గుండె ఆగి చనిపోయిన మృతులకు నష్టపరిహారం చెల్లించాలి.
6. ఎమ్మెల్యే ఆధ్వర్యాన జరుగుతున్న విధ్వంసాన్ని ఆపి నిష్పాక్షికంగా విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలి. ఆయన చర్యలను, దుర్భాషలను అదుపు చేయాలి. ఎమ్మెల్యే ఒత్తిడి ఆదేశాలతో చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులను నియంత్రించాలని కోరారు.

తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ ప్రియదర్శిని మృతి

హైదరాబాద్ : తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ మాటూరి గిరిజా ప్రియదర్శిని (61) ఆదివారం ఉదయం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. జస్టిస్ ప్రియదర్శిని భౌతికకాయాన్ని హఫీజ్‌పేటలోని ఆమె నివాసంలో ఉంచారు. అంత్యక్రియలు సోమవారం నాడు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతి పట్ల హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

1995లో న్యాయవాదిగా తన వృత్తిని ప్రారంభించిన జస్టిస్ ప్రియదర్శిని, విశాఖపట్నంలో సివిల్, క్రిమినల్, లేబర్ లా, వైవాహిక వివాదాలకు సంబంధించిన కేసులను వాదించారు. 2008 నవంబర్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా జిల్లా జడ్జిగా ఎంపికై న్యాయ సేవలో చేరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో అదనపు జిల్లా జడ్జిగా సేవలందించారు. అనంతరం పదోన్నతి పొంది, 2022 మార్చి 24న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. సీనియారిటీ ప్రకారం ఆమె 16వ స్థానంలో ఉన్నారు. వచ్చే ఏడాది ఆమె పదవీ విరమణ చేయాల్సి ఉంది. విశాఖపట్నం ఎన్‌బిఎం లా కాలేజీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందిన ఆమె, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లాలో ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. అంతకుముందు సోషియాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్‌లలో మాస్టర్స్ డిగ్రీలు కూడా పొందారు. ఆమె తండ్రి అప్పారావు వాణిజ్య పన్నులశాఖ అధికారిగా పనిచేశారు. జస్టిస్ ప్రియదర్శినికి భర్త డాక్టర్ కె విజయ్ కుమార్, ఇద్దరు కుమారులు నిఖిల్, అఖిల్ ఉన్నారు.

మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదు

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టులతో చర్చలకు తావే లేదని, నిషేధిత సంస్థతో సంభాషణ అనే ఆలోచన దారుణమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. తుపాకీతో అమాయకులను, గిరిజనులను కాల్చి చంపుతున్నవాళ్లను సామాజిక కోణంతో చూడాలంటారా.. ఇది ఎలాంటి నైతికత అని అన్నారు. మావోయిస్టులపై నిషేధం విధించిన కాంగ్రెస్... ఇప్పుడు చర్చలు జరపాలని మాట్లాడడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. మావోయిస్టులపై నిషేధాన్ని ఎత్తివేయగల ధైర్యం కాంగ్రెస్ సర్కార్‌కు ఉందా అని ప్రశ్నించారు. గతంలో మావోయిస్టులు కాంగ్రెస్, బిజెపి, టిడిపి నాయకుల్ని సహా ఎందరినో హత్య చేశారని తెలిపారు. గిరిజనుల్ని, పోలీసులను బాంబులతో, తుపాకులతో చంపినవాళ్లతో ప్రభుత్వం చర్చలు జరపాలనుకోవడమే మానవత్వానికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

వెంటనే జనగణన షెడ్యూలు ప్రకటించాలి

మొదటిపేజి తరువాయి

దానిని ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఎటిఎఫ్) దృష్టికి తీసుకెళ్లాలి. సీమాంతర ఉగ్రవాదాన్ని అడ్డుకోవడానికి, నిరోధించడానికి సైనిక చర్య ఉపయోగపడుతుందా లేదా అనే విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిశీలించాలి.

కులగణనపై...

జనగణనతో పాటే కులగణన కూడా నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం సానుకూల చర్య. ఈ అంశంపై సిపిఎం చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నదే. కుల సమాచారం, ఇతర వివరాల సేకరణకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం ఇంకా స్పష్టం చేయలేదు. చాలా కాలంగా వాయిదా పడుతూ వస్తున్న జనాభా లెక్కల సేకరణ షెడ్యూలును ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి.

వక్ఫ్ చట్టం, మతపరమైన దాడులపై...

బిజెపి ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చిన తర్వాత దేశంలోని వివిధ నగరాలలో మైనారిటీలపై మతపరమైన దాడులు జరిగాయి. ముస్లింల ఆస్తులను లక్ష్యంగా చేసుకొని వాటిని తగలబెట్టారు. బీజేపీ ఈ బిల్లును ఉపయోగించుకొని మత ప్రాతిపదికన ప్రజలను సమీకరించి మైనారిటీలపై దాడులు చేస్తోంది. వక్ఫ్ బిల్లు తర్వాత చర్చి ఆస్తులపై దృష్టి సారించాలని కొందరు బిజెపి నాయకులు చెబుతున్నారు. ఇది వారి వాస్తవ ఉద్దేశాలను బట్టబయలు చేస్తోంది. అన్ని మైనారిటీ వర్గాల ఆస్తులను స్వాధీనం చేసుకోవడం, రాజ్యాంగపరంగా మైనారిటీలకు సంక్రమించిన హక్కులు, రక్షణలను వారికి అందకుండా చేయడమే వారి ఉద్దేశం. పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ముస్లిం తీవ్రవాద సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. అవి హిందూత్వ మతతత్వ శక్తుల చేతుల్లోకి వెళుతున్నాయి.

సుప్రీం తీర్పుపై...

గవర్నర్ అధికారాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు...ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాల పనితీరును అడ్డుకునేందుకు గవర్నర్ల అధికారాలను ఉపయోగించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఎదురు దెబ్బ. గవర్నర్లకు కాలపరిమితితో కూడిన మార్గదర్శకాలను సుప్రీంకోర్టు నిర్దేశించింది. గవర్నర్లు రాజకీయ ఏజెంట్లుగా వ్యవహరించకూడదని, రాజ్యాంగ ప్రముఖులుగా పనిచేయాలని హితవు పలికింది. తీర్పును అంగీకరించి, రాష్ట్ర శాసనసభల ఆకాంక్షలను గౌరవించాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు బదులుగా సుప్రీంకోర్టు ఆదేశాలను సవాలు చేయాలని చూస్తోంది. దీనిని ఎట్టి పరిస్థితులలోనూ అనుమతించకూడదు. ఉప రాష్ట్రపతి, కొంతమంది బిజెపి నాయకులు చేస్తున్న కొన్ని ప్రకటనలు న్యాయస్థానాల అధికారాన్ని సవాలు చేస్తున్నాయి. వాటిని మనం ఖండించాల్సి ఉంది.

ఆపరేషన్ కగార్‌పై...

ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాలలో మావోయిస్టులను ఏరివేయడానికి కేంద్రప్రభుత్వం మొదలు పెట్టిన ఆపరేషన్ కగార్ అక్కడి ఆదివాసీల జీవితాలలో భయాన్ని రేపుతోంది. ప్రభుత్వంతో సంప్రదింపులకు మావోయిస్టులు సంసిద్ధత వ్యక్తం చేశారు. ప్రభుత్వ దళాలు, మావోయిస్టుల మధ్య జరిగే ఎదురు కాల్పులలో అమాయకులైన ఆదివాసీలు ప్రాణాలు కోల్పోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఆయుధాల వినియోగం ద్వారా మాత్రమే సమస్య పరిష్కారం కాదు కాబట్టి శాంతి చర్చలకు ప్రభుత్వం అంగీకరించాలి.

అమెరికా సుంకాల యుద్ధంపై...

దాదాపు అన్ని దేశాల ఉత్పత్తులపై అమెరికా దిగుమతి సుంకాలను పెంచింది. కానీ ఆ తర్వాత ఒక్క చైనాను మినహాయించి మిగిలిన దేశాలన్నింటికీ సుంకాల నుండి 90 రోజుల విరామం ప్రకటిస్తూ వెనక్కి తగ్గింది. అమెరికా చర్యను అనేక దేశాలు వ్యతిరేకించాయి. చైనా, కెనడా, మెక్సికో, యూరోపియన్ యూనియన్‌లు అమెరికా నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలను పెంచడం ద్వారా ప్రతీకార చర్యకు పూనుకున్నాయి. ఆ దేశాలకు భిన్నంగా భారత ప్రభుత్వం మన వస్తువులపై సుంకాల విధింపును వ్యతిరేకించలేదు. అంతేకాక స్వచ్ఛందంగా సుంకాలను తగ్గించి ట్రంప్ ప్రభుత్వాన్ని శాంతపరచే ప్రయత్నం చేస్తోంది.

భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై...

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై (బిటిఎ) సంతకాలు చేయడానికి భారత ప్రభుత్వం అమెరికాతో చర్చలు జరుపుతోంది. ఇప్పటికే రెండు దఫాలుగా చర్చలు జరిగాయి.

ఈ సంవత్సరం చివరి నాటికి ఒప్పందం కుదురుతుందని భావిస్తున్నారు. అమెరికా వ్యవసాయోత్పత్తుల కోసం భారత్ తన మార్కెట్‌ను అనుమతించాలని, పేటెంట్ చట్టాలలో కూడా మార్పులు తీసుకురావాలని ట్రంప్ ప్రభుత్వం కోరుతోంది. రైతులకు, దేశ ప్రయోజనాలకు హాని కలిగించే ఇలాంటి ప్రయత్నాలన్నింటినీ భారత్ ప్రతిఘటించాలి.

గాజాలో మారణహోమంపై...

పాలస్తీనాలోని గాజాపై కొనసాగుతున్న యుద్ధాన్ని పొలిట్‌బ్యూరో ఖండించింది. ఇజ్రాయిల్ దాడులు, సహాయ సామగ్రిని తరలించే వాహనాలపై విధించిన నిషేధం కారణంగా గాజా ప్రజలు మూకుమ్మడిగా ఆకలితో బాధపడుతున్నారు. ఇజ్రాయిల్‌పై కాల్పుల విరమణ ప్రకటించడానికి, గాజాలోకి ఆహారం, ఇతర నిత్యావసరాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సరఫరా కావడానికి అంతర్జాతీయ సమాజం వెంటనే ఒత్తిడి తీసుకురావాలి.

బీహార్ ఎన్నికలపై...

బీహార్ శాసనసభకు అక్టోబరులో ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికలలో పోటీ చేయడానికి పార్టీ సన్నాహాలు ప్రారంభిస్తుంది. ఇప్పటికే మహాగట్‌బంధన్ భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరుపుతోంది.

నూతనంగా ఎన్నికైన పార్టీ కేంద్ర కమిటీ వచ్చే నెల 3, 4, 5 తేదీలలో న్యూఢిల్లీలో సమావేశమవుతుంది.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను రోడ్డుపాలు చేయొద్దు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులకు విధుల్లోంచి తొలగించి వారి జీవితాలను రోడ్డుపాలు చేయొద్దని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు రవి అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1543వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో ఐఎన్‌టియుసి నాయకులు, కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులు స్టీల్‌ప్లాంట్ ప్రగతిలో కీలకపాత్ర పోషించారన్నారు. వారి పట్ల యాజమాన్యం అనుసరిస్తోన్న విధానాలను తప్పుబట్టారు. ఆర్ నెంబర్ ద్వారా తమకు శాశ్వత ఉద్యోగం వస్తుందని దశాబ్దాలుగా ఎదురుచూస్తూ చాలీచాలని జీతాలతో కాంట్రాక్ట్ కార్మికులుగా ఏళ్లకాలం నుంచి వారంతా పనిచేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఆర్థిక ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా కొద్దికాలంగా తొలగింపులకు పాల్పడుతుండడంతో వారంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యంతో చావు రేవో తేల్చుకోవడానికి సిద్ధమవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్లాంట్ ప్రయివేటీకరణ, కాంట్రాక్టు కార్మికుల తొలగింపు నిర్ణయాలను మోడీ సర్కారు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

9 నుంచి షర్మిల రాష్ట్ర వ్యాప్త పర్యటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఎపిసిసి) అధ్యక్షులు వైఎస్ షర్మిల ఈ నెల 9 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రాజా తెలిపారు. పార్టీని బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ పర్యటన తిరుపతి జిల్లా నుంచి ప్రారంభమై విశాఖ జిల్లాతో ముగుస్తుందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా సమస్యలు తెలుసుకుని ఆయా జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తారని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకురానున్నట్లు తెలిపారు. షర్మిల పర్యటన తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల, వైఎస్ఆర్ కడప, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు, ఎన్‌టిఆర్, కృష్ణా, ఏలూరు, పశ్చిమగోదావరి, బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా జిల్లాల్లోని రాష్ట్ర కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, అసెంబ్లీ కో-ఆర్డినేటర్లు, ఇతర నాయకులు అందరూ పాల్గొనాల్సిందిగా కోరారు.

విద్యుత్ వినియోగంలో తెలంగాణ టాప్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ వినియోగంలో పెద్ద రాష్ట్రాలను సైతం వెనక్కి నెట్టి తెలంగాణ దూసుకెళుతోంది. జనాభా, వైశాల్యాల పరంగా పెద్దవైన రాజస్థాన్, మధ్యప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాలకన్నా మార్చిలో తెలంగాణలో అధిక కరెంటు వినియోగం నమోదైంది. దేశంలో తెలంగాణ 6వ స్థానంలో ఉన్నట్లు కేంద్ర విద్యుత్ మండలి (సీఈఏ) తాజా నివేదిక-2024-25లో వెల్లడించింది. ఈ ఏడాది మార్చిలో అత్యధికంగా మహారాష్ట్ర 20,400 మిలియన్ యూనిట్ల(మి.యూ.) వినియోగంతో తొలిస్థానం సాధించగా దాని తర్వాత వరుసగా గుజరాత్(13,985), తమిళనాడు(11,676), ఉత్తర్‌ప్రదేశ్(11,395), కరా?టక(10,496), తెలంగాణ(9,951) నిలిచాయి. తెలంగాణలో 2024 మార్చిలో 9,009 మి.యూ.లను వినియోగించగా సరిగ్గా ఏడాది తర్వాత 10.5% వ ద్ధి నమోదవడం గమనార్హం. తమిళనాడులో వినియోగం 11,929 నుంచి 11,676 మి.యూ.లకు పడిపోవడంతో వృద్ధిరేటు మైనస్ 2.1శాతంగా నమోదైంది.

పరిశ్రమలు, వ్యవసాయం, ఇళ్లలో కరెంటు వాడకం అధికమైనందునే తెలంగాణలో వృద్ధిరేటు రెండంకెల స్థాయిని దాటినట్లు సీఈఏ వివరించింది. అభివృద్ధి చెందిన రాష్ట్రాలుగా పేరున్న మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, పంజాబ్‌లలో ఈ స్థాయి వృద్ధిరేటు లేకపోవడం గమనార్హం. ఇక తెలంగాణలో రోజువారీ గరిష' డిమాండు సైతం 2025 మార్చి 20న అత్యధికంగా 17,162 మెగావాట్లుగా నమోదైంది. అంతకుముందు ఈ రికార్డు 2024 మార్చి 8న 15,623 మెగావాట్లుగా ఉన్నట్లు సీఈఏ వివరించింది. వ్యవసాయానికి తెలంగాణలో 24 గంటల ఉచిత సరఫరా ఉన్నందున డిమాండు, వినియోగంలో వ ద్ధిరేటు అధికంగా ఉంటోంది. ఏటా మార్చిలో రబీ పంటలు సాగులో ఉంటాయి. రాష్ట్రంలో 29 లక్షలకుపైగా ఉన్న వ్యవసాయ బోర్లను మార్చిలో అధికంగా వాడటంతో డిమాండు రికార్డు స్థాయిలో పెరుగుతోంది.

కాకినాడ జిల్లా కాజులూరు మండలంలోని జగన్నాథగిరిలో నీట మునిగిన ధాన్యం రాశులు

వర్ష బీభత్సం

మొదటిపేజి తరువాయి

ఓజిలి మండలం గ్రద్దగుంట పంచాయతీ గొల్లపాలేనికి చెందిన ఏదో తరగతి విద్యార్థి కార్తీక్ (12 మామిడి తోటలో ఉండగా వర్షంతోపాటు పిడుగు పడింది. దీంతో, విద్యార్థి మృతి చెందాడు. ,నాయుడుపేట మండలం ఒద్దిగుంట కండ్రిగ పంట పొలాల్లో పిడుగుపాటుకు రైతుల అల్లం భాస్కర్ (55) మరణించారు.

కృష్ణా జిల్లా ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం-గాజుల్లంక మధ్య పిడుగుపాటుకు మొవ్వ మండలం కోసూరు గ్రామానికి చెందిన మాతంగి సుప్రదీప్ (23) మృతి చెందారు.కృష్ణానది రేవు గుండా గాజుల్లంక వైపునకు బైక్‌కు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఏలూరు జిల్లా ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామంలో రేకుల షెడ్డుపై భారీ వృక్షం కూలడంతో ఆ ఇంట్లోని బాలగోవింద్ (12) మృతి చెందాడు. దెందులూరు గ్రామంలోని పెద్ద దళితవాడకు చెందిన తాపీ మేస్త్రీ తానికొండ జార్జి విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. వర్షానికి తన ఇంటి ముందు సర్వీస్ వైర్ తెగిపడింది. దీనిని గమనించని ఆయన ఆ వైర్ తగలడంతో మృతి చెందాడు.

రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తం

- మంత్రి అనగాని సత్యప్రసాద్

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో భారీగా పడుతున్న వర్షాల నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాలతో మంచినీరు, విద్యుత్తు సరఫరాకు ఎటువంటి ఆటంకమూ లేకుండా చూసుకోవాలని సూచించారు. వర్షాలతో నష్టపోయిన పంటల వివరాలు సేకరించాలని, ఈదురుగాలులతో చెట్లు పడిపోతే వాటిని తొలగించి ప్రజా రవాణాకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పాఠశాలల ప్రారంభానికి ముందే తల్లికి వందనం

మొదటిపేజి తరువాయి

కడపలో నిర్వహించుకుంటున్నామని చెప్పారు. మహానాడు తర్వాత రాష్ట్ర కమిటీ పూర్తి చేస్తామని వెల్లడించారు. సుస్థిర ప్రభుత్వం ఉండటంతో గుజరాత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఆ రాష్ట్ర మోడల్ రాష్ట్రంలోనూ అమలవ్వాలని చెప్పారు. ప్రభుత్వం ఏ మంచి కార్యక్రమం చేపట్టినా వైసిపి చౌకబారు విమర్శలు చేస్తోందని, వాటిని తిప్పికొట్టండని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి ఇచ్చినంత ప్రాధాన్యతే పార్టీకి కూడా ఇస్తున్నానని, ఏడాది పాలనలోనే స్పష్టమైన మార్పులు చూపించి ప్రజలకు నమ్మకాన్ని కలిగించామని చెప్పారు.

నీట్ ఎస్ఎస్ -2024లో నిమ్స్ విద్యార్థికి జాతీయస్థాయిలో మొదటి ర్యాంక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీట్ ఎస్ఎస్–2024లో హైదరాబాద్‌లోని నిమ్స్ విద్యార్థి జాతీయస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించారు. వరసగా రెండో సంవత్సరం కూడా నిమ్స్ విద్యార్థియే అఖిల భారత స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించి రికార్డు సృ ష్టించారు. డాక్టర్ జకీర్ హుస్సేన్ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించి గత సంవత్సరంలో తన సీనియర్లు స్థాపించిన విద్యా నైపుణ్య వారసత్వాన్ని కొనసాగించారు. నిమ్స్ జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన 12 మంది వైద్యులు అగ్రశ్రేణి ర్యాంకులను సాధించి, దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మక సూపర్–స్పెషాలిటీ కోర్సుల్లోకి ప్రవేశం పొందనున్నారు. అత్యధిక విజయాలు సాధించిన వారి జాబితాలో డాక్టర్ జాకీర్ హుస్సేన్ (1 ర్యాంక్), డాక్టర్ భానుచంద్ (9 ర్యాంక్), డాక్టర్ రోహిత్ (14), డాక్టర్ యు.సౌమ్య (21), డాక్టర్ సయ్యద్ ఖలీలుల్లా (43), డాక్టర్ కష్ణ కిషోర్ సోమాని (50), డాక్టర్ వి.సాయి స్ఫూర్తి (58), డాక్టర్ ధీరజ్ అనిరుధ్ (67), డాక్టర్ అమ్తుల్ రహీం సుర్యమ్ (361), డాక్టర్ రజిత (420), డాక్టర్ ఎవిఎస్ శ్రీలేఖ్య (456) ఉన్నారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన యువ వైద్యులను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి భీరప్ప, డీన్ లీజా రాజశేఖర్, జనరల్ మెడిసిన్ విభాగాదిపతి ప్రొఫెసర్ సుబ్బలక్ష్మి, సీనియర్ వైద్యులు ప్రొఫెసర్ నావెల్ చంద్ర, ప్రొఫెసర్ రామ్ మూర్తి, ఇతర వైద్యులు ప్రత్యేకంగా అభినందించారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బిఇఎంఎస్) నిర్వహించే నీట్ ఎస్ఎస్–2024, భారతదేశంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఆశావహులకు అత్యంత పోటీతత్వ ప్రవేశ పరీక్షల్లో ఒకటి. పరీక్ష జనరల్ మెడిసిన్, సర్జరీ, పీడియాట్రిక్స్, రేడియోడయాగ్నోసిస్, సైకియాట్రీ, అనస్థీషియాలజీ, ఇఎన్‌టి, రెస్పిరేటరీ మెడిసిన్, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫార్మకాలజీ, ప్రసూతి, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్‌తో సహా 13 సూపర్–స్పెషాలిటీ స్ట్రీమ్‌లను విస్తరించింది.

తిరుమలకు పోటెత్తిన యాత్రికులు

- క్యూలైన్‌లో తోపులాటలు, వాగ్వాదం

ప్రజాశక్తి– తిరుమల

వేసవి సెలవులు కావడంతో తిరుమల శ్రీవారి దర్శనానికి యాత్రికులు భారీగా తరలివస్తున్నారు. ఆదివారం యాత్రికుల రద్దీ పెరిగింది. దీంతో శ్రీవారి దర్శనానికి గంటల కొద్దీ సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లలో వెంకన్న దర్శనం కోసం క్యూ లైన్‌లో వేచి ఉన్నారు. ఉచిత దర్శనం క్యూ లైన్‌లోకి ఉదయం 7.30 గంటలకు టోకెన్ లేకుండా ప్రవేశించిన యాత్రికులకు సుమారు 15 గంటల సమయం పడుతోంది. టైమ్ స్లాట్ దర్శనం యాత్రికులకు ఐదు గంటలకుపైగానే దర్శనానికి నిరీక్షిస్తున్నారు. రూ.300ల ప్రత్యేక దర్శనం టికెట్లు కొనుగోలు చేసిన వారికి మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. తిరుమల శ్రీవారి ఆలయం ముందు క్యూ లైన్‌లో యాత్రికుల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవ కారణంగా ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. క్యూలైన్‌లో చిన్న పిల్లలతో వస్తున్న మహిళలను తోటి యాత్రికులు తోసి వేశారు. దీంతో, యాత్రికుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విజిలెన్స్, పోలీసు సిబ్బంది జోక్యం చేసుకుని వారికి సర్దిచెప్పి పంపించేశారు. తిరుమల వేంకటేశ్వర స్వామిని శనివారం ఒక్కరోజే 84 వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.12 కోట్లు వచ్చిందని టిటిడి అధికారులు తెలిపారు.

టిటిడి ఛైర్మన్‌కు చెక్కును అందజేస్తున్న దాత

ఎస్‌వి అన్నప్రసాదం ట్రస్టుకు రూ.1.50 కోట్లు విరాళం

ప్రజాశక్తి– తిరుమల:

బెంగళూరుకు చెందిన సుయుగ్ వెంచర్స్ ఎల్ఎల్‌పి సంస్థ ఛైర్మన్ యతీష్ సూరినేని ఎస్‌వి అన్న ప్రసాదం ట్రస్టుకు ఆదివారం రూ.1.50 కోట్లు విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుమలలోని టిటిడి ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఛైర్మన్ బిఆర్ నాయుడుకు విరాళం చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఛైర్మన్ అభినందించి, దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ పాల్గొన్నారు.

20 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి–శృంగవరపుకోట (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా శృంగవరపుకోట పట్టణంలో ఒడిశా నుంచి అక్రమంగా ఆటోలో తరలిస్తున్న 20 కేజీల గంజాయిని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి కేరళకు అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు పందిరప్పన్న జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓ వాహనంలో ఫర్నిచర్ మాటున ఒడిశా నుంచి కేరళకు తరలిస్తున్న 20 కేజీల గంజాయిని సిఐ ఎన్.నారాయణమూర్తి ఆధ్వర్యాన పట్టుకున్నారు. తమిళనాడుకు చెందిన వాహన డ్రైవర్ మరియఅరుళ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

సార్వత్రిక సమ్మెకు సెక్యూరిటీ గార్డ్స్ మద్దతు

- సిఐటియు జాతీయ కోశాధికారి సాయిబాబు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు పిలుపునిచ్చారు. ఎపి ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సమావేశం విజయవాడలోని ఎంబివికెలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రైవేటు సెక్యూరిటీ వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఎటువంటి భారం లేకపోయినప్పటికీ ప్రైవేటు సెక్యూరీటీ గార్డుల వేతనాల సవరణకు చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇందుకు ప్రధాన కారణం ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలను అవలంభించడమేనన్నారు. ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్ వేతనాల సవరణ గత దశాబ్ధకాలంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టలేదన్నారు. దీనివల్ల ప్రైవేటు ఏజెన్సీలు లబ్ధిపొందుతుంటే, ఈ రంగంలో పనిచేసే లక్షలాది మంది సెక్యూరిటీ గార్డుల కుటుంబాలు చాలీచాలని వేతనాలతో అలమటిస్తున్నాయని తెలిపారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ, గతంలోని చట్టాలను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం కరోనా సమయంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. దీనివల్ల పరిశ్రమలు, సంస్థల్లో యూనియన్ ఏర్పాటు, సమస్యలపై సెమ్మెకు నోటీసు ఇవ్వడం కూడా నేరమే అవుతుందని తెలిపారు. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే 20వ తేదీ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సిఐటియు పోరాటాలతో యాజమాన్యం వ్యతిరేకించినా శామ్‌సంగ్ కంపెనీలో యూనియన్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంక్షోభంలో పారిశ్రామికవేత్తలకు లాభాలు రావడం లేదని, దీంతో కార్మికుల పొట్టగొట్టి యాజమాన్యాలకు మేలు చేసేందుకే ప్రభుత్వాలు ఇటువంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నాయని చెప్పారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సెక్యూరిటీ గార్డులుగా 50 లక్షల మంది పని చేస్తున్నారని, అయితే, రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను సవరించలేదన్నారు. వేతనాల కోడ్ పేరుతో కార్మికుల వేతనాలపై దాడి జరుగుతోందన్నారు. సార్వత్రిక సమ్మెకు సన్నద్ధంగా యూనియన్ నాయకులు ఈ నెల 10వ తేదీలోపు సదస్సులు, 17, 18వ తేదీల్లో మోటార్ సైకిల్ జాతాలు, కార్మికుల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. 20న సమ్మెలో భాగంగా నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. యూనియయ్ ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ.. అన్ని జిల్లాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశానికి యూనియన్ అధ్యక్షులు బుజ్జిబాబు అధ్యక్షత వహించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జాతీయ కోశాధికారి సాయిబాబు

కార్మికవర్గ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం

ఒక్క అడుగైనా వేయలేదు

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ సరసింగరావు

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా కార్మిక వర్గ సంక్షేమానికి ఒక్క అడుగైనా ముందుకు వేయలేదని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు విమర్శించారు. గత రెండ్రోజులుగా జరుగుతున్న సిఐటియు సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన నర్సింగరావు ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేట్ రంగ సంస్థల్లో, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ విధానాల్లో లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారని, కనీస వేతనాల బోర్డును ఏర్పాటు చేసేందుకూ ప్రభుత్వం ముందుకు రాలేదని తెలిపారు. గత ప్రభుత్వం కార్మిక వర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడి వర్కర్లు, ఆశా వర్కర్లు, మున్సిపల్ వర్కర్లు, పెద్ద ఎత్తున పోరాటం చేశారని గుర్తు చేశారు. మీకు న్యాయం చేస్తామని నాడు ఆ టెంట్లు చుట్టూ తిరిగిన టిడిపి, జనసేన నాయకులు.. ఇచ్చిన హామీల సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం రాగానే తొలి సంతకం బిల్డింగ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని కార్మిక శాఖ మంత్రి ప్రకటించారని, ఇప్పుడు పట్టించుకోవడం లేదని అన్నారు. అప్పుడు విజన్ 2020తో పేదరికం నిర్మూలన అవుతుందని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు విజన్ 2047 అంటున్నారని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ సంగతేంటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ అంశంపై స్పష్టంగా చెప్పటం లేదని పారిశ్రామికవేత్త మిట్టల్‌కు మాత్రం స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు క్యాప్టివ్ మైన్స్ ఇస్తామంటూ ప్రకటించడం ఏంటో ప్రజలకు తెలియజేయాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

మే 20వ తేదీ సార్వత్రిక సమ్మె అనంతరం రాష్ట్రంలో ఉద్యోగ కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతుందని తెలిపారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న ఆయుధాలతో పోలీసు సిబ్బంది

పల్నాడులో హైటెన్షన్

- వెల్దుర్తిలో కార్డన్ సెర్చ్
- భారీగా మారణాయుధాలు స్వాధీనం

ప్రజాశక్తి–వెల్దుర్తి (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భారీగా మారణాయుధాలు లభ్యమయ్యాయి. శిరిగిరిపాడులో గ్రామంలో వారం రోజుల క్రితం రెండు గ్రూపుల మధ్య వివాదం చెలరేగింది. తాత్కాలికంగా వివాదం సద్దుమణిగినా దాడులకు రెడీ అయ్యాయి. ఈ సమాచారం ముందుగానే తెలుసుకున్న పోలీసులు ఆదివారం ఉదయం ఒక్కసారిగా గ్రామంలో కార్డన్ సెర్చ్ చేశారు. ఈ కార్డన్ సెర్చ్‌లో కారం కలిపిన నీళ్ల బాటిళ్లు, రాళ్లతో నింపిన బస్తాలు, కత్తులు, గొడ్డళ్లు, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 21 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గురజాల డిఎస్‌పి హనుమంతరావు సారథ్యంలో నలుగురు సిఐలు, 11 మంది ఎస్ఐలు, వందమంది పోలీసు సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగించే పనులను సహించేది లేదని హెచ్చరించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల కొరత

- దాదాపు 62.9 లక్షల కేసులు పెండింగ్

న్యూఢిల్లీ : దేశ ప్రజల హక్కులను పరిరక్షించాల్సిన న్యాయవ్యవస్థ కొలువుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కేసులను పరిష్కరించేందుకు తగినంత మంది న్యాయమూర్తులు లేకపోవడంతో పెండింగ్ కేసులు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. ప్రత్యేకించి ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల కొరత మరింత తీవ్రంగా ఉంది. న్యాయ శాఖ తాజా డేటా ప్రకారం, దేశంలో మొత్తం 25 హైకోర్టులు ఉండగా..వీటిలో 1,114 న్యాయమూర్తులు నియమించాల్సివుండగా ప్రస్తుతం 769 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. ఇంకా 345 పోస్టులు అంటే 30 శాతం కంటే ఎక్కువ ఖాళీగా ఉన్నాయి. ఖాళీల కారణంగా దేశవ్యాప్తంగా అన్ని హైకోర్టుల్లో కలిపి 62,96,798 కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి. దేశ రాజధాని నగరమైన న్యూఢిల్లీ వంటి అత్యంత కీలకమైన చోట కూడా అక్కడి హైకోర్టులో న్యాయమూర్తుల కొరత తీవ్రస్థాయిలో ఉంది. గత వారం ఢిల్లీ హైకోర్టు తన రోజువారీ కేసు జాబితాలో అన్ని కేసులను న్యాయమూర్తుల కొరత కారణంగా విచారణ చేపట్టలేకపోయింది. ఇది న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న వ్యవస్థాగత సవాళ్లను గుర్తు చేస్తోంది. విదేశాలకు వెళ్లడానికి అనుమతి కోరుతూ మోసం, ఫోర్జరీ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తి చేసిన సాధారణ దరఖాస్తు విచారణ సందర్భంగా ఈ పరిశీలన వచ్చింది. ఢిల్లీ హైకోర్టుకు 60 జడ్జి పోస్టులు మంజూరైతే, 36 మంది న్యాయమూర్తులతో మాత్రమే పనిచేస్తుంది. దాదాపు 40 శాతం న్యాయ మూర్తి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఢిల్లీ ఉన్నత న్యాయస్థానంలోనే ఏకంగా 1,34,090 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అత్యధిక సంఖ్యలో ఖాళీలతో అలహాబాద్ హైకోర్టు నిలిచింది. ఇక్కడ 160 పోస్టులు ఉండగా 81 ఖాళీగా ఉన్నాయి. ఈ కోర్టులో 11,76,229 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పంజాబ్, హర్యానా హైకోర్టులో 85 పోస్టులకు 32 ఖాళీలున్నాయి. సిక్కిం, మేఘాలయ హైకోర్టులు మాత్రమే ఖాళీలను నివేదించాయి. పార్లమెంటులో న్యాయమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వెల్లడించిన వివరాల ప్రకారం.. 150 మంది హైకోర్టు న్యాయమూర్తుల నియామక ప్రతిపాదనలు ప్రస్తుతం ప్రభుత్వం, సుప్రీంకోర్టు కొలీజియం మధ్య వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. మరో 205 ఖాళీల కోసం, సంబంధిత హైకోర్టు కొలీజియంల నుంచి ప్రతిపాదనలు అందాల్సివుంది. 'ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025' నివేదిక ప్రకారం.. 2020 , 2024 మధ్య భారత కోర్టులలో పెండింగ్ కేసులు దాదాపు 20 శాతం పెరిగాయి. 'జనాభా ఆధారంగా భారతదేశం సగటున 18.7 లక్షల మందికి ఒక హైకోర్టు న్యాయమూర్తి' ఉన్నట్లు నివేదికలో విశ్లేషించారు. 2024 చివరి నాటికి, సిక్కిం, త్రిపుర , మేఘాలయ మినహా చాలా హైకోర్టులలో న్యాయమూర్తులు ఒక్కొక్కటి వెయ్యి కేసులను విచారణ చేపట్టాయి.

విధి నిర్వహణలో జవాన్ మృతి

- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి–బాపట్ల జిల్లా

నార్ల నరేష్

బాపట్ల జిల్లా అమృతలూరు గ్రామానికి చెందిన సైనికుడు నార్ల నరేష్ (36) విధి నిర్వహణలో దుర్మరణం పాలయ్యారు. నరేష్ 15 ఏళ్ల క్రితం సైన్యంలో చేరారు. ప్రస్తుతం పంజాబ్‌లోని పఠాన్ కోటలో సిఎంపి బెటాలియన్‌లో నాయక్‌గా సేవలందిస్తున్నారు. ఈ నెల 2న వాహనానికి మరమ్మతులు చేస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతిచెందారు. సైనికాధికారులు నరేష్ మృతదేహాన్ని ఆదివారం అమృతలూరుకు తీసుకొచ్చారు. సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో తహశీల్దార్ నెహ్రూబాబు, ఎస్ఐ అమరవర్ధన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

25 వేల పంట కుంటల నిర్మాణం పూర్తి

- పిఆర్అండ్ఆర్‌డి కమిషనర్ కృష్ణ తేజ

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

పంట కుంటల తవ్వకంలో ఇప్పటి వరకూ 25 వేల కుంటలను పూర్తి చేసినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఎంవిఆర్ కృష్ణతేజ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.55 లక్షల పంట కుంటలు ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతుల భూముల్లో తవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యధికంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4,030, అన్నమయ్య జిల్లాలో 3,067, పార్వతీపురం మన్యం జిల్లాలో 2,521 పంట కుంటల నిర్మాణాలు పూర్తి చేసి మొదటి మూడు స్థానాల్లో నిలిచాయని తెలిపారు. వీటి నిర్మాణం వల్ల ఒక వర్షానికి 1.80 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసుకోవచ్చని పేర్కొన్నారు. 1.55 లక్షల కుంటల్లో ఒకసారి వర్షానికి దాదాపు ఒక టిఎంసి నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉందన్నారు. బోరు బావులు లేని రైతులకు పంట కుంటలు వారు వేసే పంటలకు సంజీవని వంటివని తెలిపారు. వీటి చుట్టూ వేసే మట్టికట్టల మీద ఆకు కూరలు, కూరగాయలు పండించుకుని అదనపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. దీర్ఘకాలం ఆదాయాన్ని ఇచ్చే బొప్పాయి, అరటి, జామ, కరివేపాకు వంటి మొక్కలను నాటుకోవచ్చని తెలిపారు. పంట కుంటల్లో చేపల పెంపకం చేపట్టి ఆదాయం పొందవచ్చన్నారు. బోరు బావులు ఉన్న పొలాల్లో పంట కుంటల తవ్వకం వల్ల బావుల్లో ఊట పెరిగి ఎక్కువ విస్తీర్ణంలో పంటలకు నీరందించడం సాధ్యమవుతుందని తెలిపారు. ఉపాధి పథకంలో వీటిని తవ్వించడం వల్ల రైతులకు రూ.50 వేల వరకూ ఖర్చు ఆదా అవుతుందన్నారు. పంట కుంటల నిర్మాణం వల్ల పంట కోల్పోతామనే భావన నుంచి రైతులు బయటపడి, బహుళ ఆదాయన్ని ఇచ్చే పంట కుంటలను వారి భూముల్లో తవ్వించుకోవాలని సూచించారు.

బిసిల అభ్యున్నతికి కృషి : మంత్రి సవిత

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

బిసిల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర బిసి, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. భగీరథ జయంతిని పురస్కరించుకుని జివిఎంసి 71వ వార్డు దుర్గానగర్‌లో భగీరథ మహర్షి విగ్రహాన్ని ఆమె ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సభలో మంత్రి సవిత మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిసి హాస్టళ్ల అభివృద్ధిపై దృష్టిపెట్టిందన్నారు. ఉచిత గ్యాస్, మెగా డిఎస్‌సి హామీలను నెరవేర్చినట్లు తెలిపారు. ఇసుక విధానంలో మార్పులు తీసుకొచ్చి ప్రజలకు ఉపయోగపడ్డామన్నారు. జగన్ సర్కారు నాడు దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రుషికొండలో ప్యాలెస్ నిర్మాణం చేపట్టారుగానీ పేదల ఇళ్లు, ఇళ్ల స్థలాలను పట్టించుకోలేదన్నారు. సగరులు ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలని కోరారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సగరులకు ఇచ్చిన మాట ప్రకారం భగీరథ విగ్రహాన్ని గాజువాకలో ఏర్పాటు చేశామన్నారు. బిసి కార్పొరేషన్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ బిసిల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.23 వేల కోట్లను కేటాయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ సంచాలకులు మల్లికార్జునరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు పాల్గొన్నారు. సభ అనంతరం మంత్రి సవితను సగరుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

గాజువాక దుర్గానగర్‌లో భగీరథ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి సవిత

రబీ ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేయాలి

- ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రబీ ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేయాలని, ఇందు కోసం టార్గెట్ల లక్ష్యాన్ని పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. రబీలో పండించిన ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయ్యిందని సాకుతో అనేక ప్రాంతాల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిపివేశారని ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, హరిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొనుగోలు నిలిచిపోవడంతో కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారులు కూడా ధాన్యం కొనుగోలుకు ముందుకు రావడం లేదన్నారు. రైతు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తామని ప్రభుత్వం హామీనిచ్చిందని, ఆచరణలో హామీ ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్‌టిఆర్, కృష్ణా, ఇంకా అనేక జిల్లాల్లో కొనుగోలు చేయాల్సిన ధాన్యం కల్లాల్లో ఉండిపోయిందన్నారు. ఏలూరు మండలం, వెంకటాపురం–1 రైతు సేవా కేంద్రం వద్ద గత రెండు రోజులుగా వాహనాల్లోకి లోడ్ చేసిన ధాన్యం ఉండిపోవడంతో కిరాయిలు పెరిగి రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. టార్గెట్ పెంచకపోతే రైతులు, కౌలురైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోలేక ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. లోడింగ్‌కు అవసరమైన సంచులు కూడా రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో లేవన్నారు. తేమ శాతం, తూకాల్లో కూడా అనేక మోసాలు దొర్లుతున్నాయని, మరోవైపు అకాల వర్షాలు, గాలివానల వల్ల ధాన్యం వర్షం బారిన పడకుండా కాపాడుకోవడం కూడా కష్టమవుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేయాలని, రైతు సేవా కేంద్రాల వద్ద నిల్వ ఉ న్న, వాహనాల్లోకి లోడ్ చేసుకున్న ధాన్యాన్ని టార్గెట్ పెంచి మిల్లులకు వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. తరలించిన ధాన్యానికి 24 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

పాఠశాలలను మూసేస్తే ఉద్యమం

- 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలి
- ఉద్యోగోన్నతులు, బదిలీలు త్వరగా పూర్తి చేయాలి
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి–కర్నూలు కలెక్టరేట్

ఒకటి నుండి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని, సంస్కరణల పేరుతో పాఠశాలలను మూసివేస్తే ఉద్యమం తప్పదని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు వేతన సవరణకు సంబంధించి 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. కర్నూలులోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటును స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 వేలకుపైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు నడుస్తున్నాయని తెలిపారు. ఉన్నత పాఠశాలలో సెక్షన్‌కు 1.42 నిష్పత్తి ఉండేలా చూడాలన్నారు. 11వ పిఆర్‌సి గడువు ముగిసి రెండు సంవత్సరాలు అవుతున్నా ఇప్పటి వరకు కొత్త పిఆర్‌సి కమిషన్‌ను ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. గత పిఆర్‌సి బకాయిలు కూడా పెండింగులో ఉన్నాయని, వీటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియను త్వరగా పూర్తిచేయలని కోరారు. రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పదో తరగతి ప్రత్యేక శిక్షణా తరగతుల పేరుతో ఉపాధ్యాయులను వేధించడం తగదన్నారు.

చంద్రంపాలెంలో మృతుల కుటుంబాలకు చెక్కు అందజేస్తున్న జెసి మయూర్ అశోక్

'సింహాచలం' మృతులకు ఎక్స్‌గ్రేషియా అందజేత

ప్రజాశక్తి –మధురవాడ, ఆరిలోవ (విశాఖపట్నం)

గత నెల 30న చందనోత్సవం రోజున సింహాచలం కొండపై గోడ కూలి ఏడుగురు మృతి చెందిన ఘటనలో వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఎక్స్‌గ్రేషియా చెక్కులను ఆదివారం అందజేశారు. మృతి చెందిన వారిలో భీమిలి నియోజకవర్గంలోని చంద్రంపాలేనికి చెందిన పిల్లా ఉమా మహేష్, శైలజ దంపతులు, అడవివరానికి చెందిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి యడ్ల వెంకటరావు కుటుంబీకులను విశాఖ జెసి మయూర్ అశోక్, భీమిలి ఆర్‌డిఒ కె సంగీత్ మాధుర్, టిడిపి నియోజకవర్గ నాయకులు గంటా రవితేజ కలిసి ఒక్కొక్కరికీ రూ.25 లక్షల చొప్పున చెక్కును అందించారు. అదే ప్రమాదంలో గాయపడిన ఆరిలోవ బాలాజీనగర్‌కు చెందిన పైలా ప్రవీణ్ కుమార్‌కు రూ.మూడు లక్షల చెక్కును జెసితో కలిసి విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అందజేశారు. చందనోత్సవం రోజున జరిగిన ఈ ఘోర దుర్ఘటనలో ఏడుగురు మరణించడం తీవ్ర విచారకరమని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో చినగదిలి తహశీల్దార్ పాల్ కిరణ్, టిడిపి నాయకులు ఒమ్మి సన్యాసిరావు, ముగడ రాజారావు, పివి నరసింహం, లొడగల అప్పారావు, పిల్లా వెంకటరావు, నాగోతి సత్యనారాయణ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జస్టిస్ దేవానంద్

నల్లూరి కాంతమ్మకు ప్రముఖుల నివాళి

ప్రజాశక్తి–చీమకుర్తి (ప్రకాశం జిల్లా)

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర కార్యదర్శి నల్లూరి మాధవరావు మాతృమూర్తి నల్లూరి కాంతమ్మ ఈ నెల 20న మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం జిఎల్‌పురంలోని వారి నివాసం వద్ద ఆదివారం పలువురు ప్రముఖులు హాజరై కాంతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాధవరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ ఎం.సుధీర్‌కుమార్, రాష్ట్ర మంత్రి డోలా వీరాంజనేయ స్వామి, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర మాజీ డిజిపి ఎబి వెంకటేశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వరరావు, వై సిద్దయ్య, జాలా అంజయ్య, అంద్ర మాల్యాద్రి, సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాయకులు పంగులూరి ప్రభాకర్ ఉన్నారు.

VIJAYAWADA MUNICIPAL CORPORATION
`E' Procurement Notice
No.5/VMC/CDB/2025-26, Dt.03-05-2025

Shamiyanas, Engaging of tankers, Fencing, Zym Equipments, Dead body Freezer Boxes, Compound wall, Greenary, Ramps, Manholes, Buildings, Fallen Slide, Jetting Machines, Conservancy Articles. Air Conditioners, Greenery, ELSR Roads, Drain, Culvert, repairs (Total 96 works)-Est Amount Rs. 1866.69 Lakhs

All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of

Further details and any corrigendum can be seen@ **www.tenderapeprocurementoovin.**

S/d-
For COMMISSIONER

కళా సాహిత్యాలు మనల్ని ప్రాంత,
దేశ, మతాలకు అతీతంగా
ఆలోచించేలా చేస్తాయి. శ్రేష్టమైన కళ మానవ
జీవిత సంపూర్ణత్వాన్ని సమగ్రంగా ప్రతిఫలించాలి.
కళాకారులకు, సాహిత్యకారులకు ఒక ప్రపంచ
దృక్పథం ఉండాలి.

– లూకాచ్

గుండెల్లో ఎగరాలి జెండా!

ఓ...చెంచులా! అనే
ఆదివాసీ అవ్వ దీర్ఘ పిలుపుకు
మనుమరాలు జింకపిల్లలా పరిగెత్తుకొస్తుంది
కొంగున మూటగట్టుకొచ్చిన బలుస పళ్ళిస్తే
గడ్డిచామంతి పూలగజ్జల పాదాలతో
తుళ్ళితుళ్ళి నృత్యం చేస్తుంది

ఆదివాసీలది పచ్చటి నాగరికత
ఆదిమ సంస్కృతి
అడవి పూసిన పూలు!

సంతలో గుంతకూర్చున్న వీరి ముందు
తాజా రేగిపండుగానో
మారేడుగడ్డగానో
అడవి కొలువు దీరుతుంది
బేరగాళ్ళ చౌక బేరానికి
చెమ్మగిల్లిన కళ్ళతో వాళ్ళు
కొమ్మ వదిలిన పూలలా వున్నారు

నిటారు వెదురునైనా
బుట్టబొమ్మను చేయగల చేతులు
నిండు గర్భిణిని డోలీలో మోస్తున్నపుడు
అనాది కష్టంలా వున్నారు

భూములిస్తామనే
ఎవరి నోటిమాటను నమ్ముతుంటారో
నీరిస్తామనే
ఎవరి పదవీ దాహానికి కరిగిపోతారో
కాలం గడచిపోతుంటుంది
మాసిన ముతక గుడ్డతోనే ...

ఎవరో బలవంతంగా వీరి చేతిని
అడవి చేతినుండి గుంజుతున్నపుడు
వీరి భూమి వీరిక్కాకుండా పోతున్నప్పుడు
ఇంకెవరో వీరి బతుక్కు మూతిబుట్లు కట్టి
పగ్గాలు చేతబట్టుకున్నపుడు
నీళ్ళ మెతుకుల బతుకును ధ్వంసం చేస్తున్నపుడు
బిడ్డల్ని పోగొట్టుకొని రోదిస్తున్న ఆదివాసీ తల్లుల్ని
ఎలా ఓదార్చాలి?
వారివైపు నిలబడి, నినాదమవ్వాలి
గుండెల్లో ఎగరాలి జెండా!

ఆదివాసీలకు పోరాటం కొత్త కాదు
ఒకరొకరుగా అందరూ ఏకమవుతారు
మొత్తం పిడికిళ్ళు బిగుసుకుంటాయి
ఇబ్బంది పెట్టినదాన్ని పట్టుకొని
జోలెలో వేసుకుపోతారు!

– శాంతయోగి యోగానంద
96522 71520.

మనమే మూలం

గుండెబావులు ఎండిపోయినప్పుడు
వెక్కివెక్కి ఏడ్చినా,
ఎడారి కంటి నుంచి
ఒక్క కన్నీటిచుక్క రాలదు!

గొంతులోంచి
గుండె బయటికి తోసుకొస్తున్నట్లు,
ఎక్కడో పడిపోయిన దేహాన్ని
ఎవరెవరో కాళ్ళతో తొక్కేసినట్లు,
దారంతా ముళ్లతో
రక్తపుమడుగులో పడ్డట్లు,
దుఃఖపు వరదలో కొట్టుకుపోయి
చివరి దశలో మిగిలిపోయినట్లు
ఎన్నెన్నో ఒంటరి ఆలోచనలు!

దుఃఖసముద్రంలో ఈదుతుంటే
అదో బాధలలోకం బానే ఉంటుంది,
కానీ
కన్నీరంతా ఇంకిపోయి
ఇసుకలా రాలిపడుతున్నప్పుడే
అత్యంత ప్రమాదకరం,
బతుకంతా చిందరవందరై
ఊహించని ముగింపునిస్తుంది!

దుఃఖమంటే
చూసేవాళ్లకు తేలికే కావొచ్చు
కానీ మోసేవాళ్ళకది అత్యంత భారం,
ఎవరి మాటలు ఓదార్చలేవు
మనకు మనమే తేలికపడాలి
జీవితం మళ్ళీ మొదలెట్టేది మనకు మనమే!

– పుట్టి గిరిధర్
94949 62080

వాక్య కరచాలనం

పేజీల దారులలో
తిరిగి తిరిగి అలిసిపోయి
కథల కలలను కంటుంటాను
గుండె గదులకు పట్టిన బూజును
అక్షరాల కర్రతో
దులుపుకుంటాను
వాక్యాల కరచాలనం తో
కావ్యాల వనాలలో
ఊహల విహారాలు చేస్తాను

గ్రంథాలయాల స్వర్గంలో
పుస్తకాల అప్సరసలతో
ఆనందడోలికల్లో మునిగిపోతాను
నాకళ్లకు
ప్రతి అక్షరమూ
ఒకముత్యమే
ప్రతి రచనా
కోహినూరు వజ్రమే
వాటితో రంగుల మాలలు కట్టి
సృజన భవంతుల ద్వారబంధాలకు
అలంకరించుకుంటాను!

– డా:వి.ఆర్.రాసాని

11న రెండు పుస్తకాల ఆవిష్కరణ

రాధకృష్ణ కర్రి కవిత్వం 'లైఫ్ డ్రామా', అమూల్య చందు కవిత్వం 'భూమి నవ్వడం చూశాను' సంపుటాల ఆవిష్కరణ ఈ నెల 11వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు విజయవాడలోని ఎంబీవీకే బాలోత్సవ్ భవన్‌లో జరుగుతుంది. ఈ రెండు పుస్తకాలను ప్రముఖ కవి నగ్నముని ఆవిష్కరిస్తారు. సభలో ప్రముఖ కవి వసీరా, కవయిత్రులు శాంతిశ్రీ, వాణిశ్రీ, సుధామురళి మాట్లాడతారు.

– లలిత పబ్లికేషన్స్, నెల్లూరు

గీతాంజలి ... అంతరంగ అన్వేషణ



సందర్భం

రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన గీతాంజలి, భారతీయ సాహిత్యంలో ఒక అద్భుతమైన రచన. ఈ కవితా సంకలనం తన ఆధ్యాత్మిక అనుభవాలను, ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని, మానవ జీవితంలోని వివిధ అంశాలను అద్భుతమైన భాషలో వర్ణించింది. ప్రపంచ సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. గీతాంజలిలో ప్రతి పద్యం ఒక విశాల భావనని ప్రతిబింబిస్తుంది. దైవం, ఆత్మ, జీవితం, మరణం వంటి అత్యంత లోతైన అంశాలను కవి తనదైన శైలిలో వివరించారు రవీంద్రుడు. ఆయన ప్రకృతిని తన రెండవ గురువుగా భావించేవారు. గీతాంజలిలో ఆకాశం, నక్షత్రాలు, చెట్లు, పక్షులు వంటి ప్రకృతి అంశాలు కవికి ఎంతో ప్రేరణనిచ్చాయి. కవి తన కాలపు సామాజిక సమస్యలపై కూడా తన కవితల్లో ప్రస్తావించారు. అణగదొక్కబడిన వర్గాల పట్ల, స్త్రీల స్థితి గురించి తన ఆందోళనను వ్యక్తం చేశారు. గీతాంజలిలో వ్యక్తమైన భావాలు, ఆలోచనలు ఒక కాలం, ఒక దేశానికి మాత్రమే పరిమితం కావు. అవి సార్వత్రిక విలువలు. ప్రపంచంలోని ప్రతి మనిషి ఎదుర్కొనే సమస్యలు, ఆశలు, ఆకాంక్షలను ఈ కవితలు ప్రతిబింబిస్తాయి.

మనిషి జీవితం అనేది ఒక అన్వేషణ. మానవ జీవితం అనంతమైన ప్రశ్నలతో నిండి ఉంటుంది. పుట్టినప్పటి నుండి మరణం వరకు, మనం ఎల్లప్పుడూ ఏదో ఒక విషయం కోసం ఆరాటపడుతూ ఉంటాము. కొన్నిసార్లు సంతోషాన్ని, కొన్నిసార్లు శాంతిని అన్వేషిస్తూ ఉంటాము. ఈ అన్వేషణ ఎల్లప్పుడూ అసంపూర్ణంగానే ఉంటుంది. మనం ఏదైనా సాధించినా, ఆ సంతోషం ఎంతో కాలం మనతో ఉండదు. ఈ ప్రయాణంలో మనం ఎన్నో ప్రశ్నలను వేసుకుంటూ ఉంటాము. జీవితం అంటే ఏమిటి? మనం ఎందుకు బతుకు తున్నాము? మరణం తర్వాత ఏముంటుంది? అనే ప్రశ్నలకు జవాబు కోసం మనం ఎల్లప్పుడూ వెతుకుతూనే ఉంటాము. గీతాంజలి ఇలాంటి ప్రశ్నలకు ఒక అద్భుతమైన జవాబు ఇస్తుంది. జీవితం గురించి, మనం ఎవరు అనే దాని గురించి, మనం ఎక్కడికి వెళ్తున్నాం అనే దాని గురించి ఆలోచించేలా చేస్తుంది. గీతాంజలిలోని ప్రతి పద్యం మన హృదయానికి ఎంతో దగ్గరగా ఉంటుంది. అది మన జీవితంలోని అన్ని అనుభవాలను ప్రతిబింబిస్తుంది.

గీతాంజలిలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఈశ్వరునితో తన సంబంధాన్ని అద్భుతంగా వర్ణించారు. ఈశ్వరుడు మన అందరిలోనే ఉన్నాడని, ఆయన మనకు మిత్రుడు, ప్రేమికుడు, తండ్రి, తల్లి అందరూ అని వివరించారు. ప్రకృతితో మన సంబంధం అనేది ఒక అనుబంధం, ఒక ప్రేమ. ఈ ప్రేమే మన జీవితానికి అర్థం ఇస్తుంది.

రవీంద్రనాథ్ గీతాంజలిని 1910లో రచించారు. ఇందులో మొత్తం 103 కవితలు ఉన్నాయి. రవీంద్రనాథ్ స్వయంగా ఈ కావ్యాన్ని ఆంగ్లంలోకి అనువదించి, 1912లో ప్రచురించారు. ఈ ఆంగ్ల అనువాదం ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రశంసలు అందుకుని, 1913లో నోబెల్ బహుమతిని తెచ్చిపెట్టింది. గీతాంజలికి నోబెల్ సాహిత్య పురస్కారం లభించడంతో భారతీయ సాహిత్యం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. గీతాంజలి అనేక భాషల్లోకి అనువాదితమై, ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది పాఠకులను ఆకట్టుకుంది. గీతాంజలి లాంటి గాఢమైన, గూఢమైన, మార్మిక తాత్త్విక కవితల్ని అనువదించటం ఎంతో అంతర్ దృష్టి, చైతన్యసాధనతో కూడుకొన్న విషయం' అంటారు సంజీవ్ దేవ్. 'గీతాంజలిని అనువదించటానికి భాషా పాండిత్యం, పరిణతి మాత్రమే సరిపోదు. దానికి జీవన సాధన అవసరం' అని కూడా ఆయనన్నారు. ఆయన చలం చేసిన గీతాంజలి అనువాదాన్ని చక్కగా సమీక్షించాడు.

గీతాంజలి మొదటి కవితలో వేణువును మోసే శ్రీకృష్ణుడితో తన బలహీనమైన పాత్ర (మానవ శరీరం) ఎన్నిసార్లు ఖాళీ చేయబడినా కొత్త జీవితంతో ఎలా నిండిపోతుందో కవి మాట్లాడతాడు. శరీరం బలహీనపడి తన ప్రాణాన్ని కోల్పోవచ్చు, కానీ కృష్ణుడిచే ఆశీర్వదించబడిన ఆనందాన్ని అనుభవించిన హృదయం, ఆత్మ ఎల్లప్పుడూ స్వచ్ఛంగా, సజీవంగా ఉంటుంది అని అర్థం. 83వ కవితలో అమ్మా, నా దుఃఖపు కన్నీళ్లతో నీ మెడకు ముత్యాల గొలుసు నేస్తాను. ఈ పద్య పాదం ఒక వ్యక్తి తన తల్లికి తనకున్న ప్రేమను మరియు భక్తిని వ్యక్తీకరించే సందర్భంలో చెప్పినది. ఇక్కడ, వ్యక్తి తన దుఃఖపు కన్నీళ్లను ముత్యాలతో పోల్చుతున్నాడు. సాధారణంగా ముత్యాలు చాలా విలువైనవి, అందమైనవి. కన్నీళ్లు బాధను సూచిస్తాయి, కానీ తల్లికి తనకున్న ప్రేమ ఎంత గొప్పదో చెప్పడానికి ఇక్కడ కన్నీళ్లను ముత్యాలతో పోల్చడం జరిగింది. వ్యక్తి తన తల్లికి తనకున్న అపారమైన ప్రేమను వ్యక్తీకరించడానికి తన దుఃఖాన్ని కూడా ఒక విలువైన ఆభరణంగా, ముత్యాల గొలుసుగా మార్చి ఆమెకు సమర్పించాలనుకుంటున్నాడు. ఇది తల్లిపై తనకున్న ప్రేమను, భక్తిని తెలియజేసే ఒక అందమైన వ్యక్తీకరణ. పుస్తకంలోని చివరి 103వ కవిత ఇతివృత్తాలను ముగించి, వాటిని భగవంతుని పాదాల వద్ద ఉంచుతుంది. ప్రకృతిని ప్రస్తావించకుండా ఏ కవిత కూడా పూర్తి కాదు. కవికి ప్రకృతి ఒక అస్తిత్వం.

1937లో విజయనగరంలో 'ఆంధ్రా రీసెర్చ్ యూనివర్సిటీ' అనే విశ్వవిద్యాలయ ప్రతిపత్తిగల సంస్థ రవీంద్రుడికి గౌరవ డాక్టరేట్ ఇచ్చింది. గొప్ప పండిత కవి లక్ష్మీనారాయణ శాస్త్రి రవీంద్రుణ్ణి ప్రశంసిస్తూ శ్లోకాలు రచించారు. రాయప్రోలు సుబ్బారావు 'పంచదళి' పేరుతో పుష్పోపహారం సమర్పించారు. భోగరాజు నారాయణమూర్తి అనే ఆనాటి ప్రసిద్ధ కవి, నవలా రచయిత ప్రశంసా పద్యాలు వినిపించారు. ఈ పరిశోధనా విశ్వవిద్యాలయం రవీంద్రుడికి 'కవి సమ్రాట్' అనే బిరుదునిచ్చి సత్కరించింది. ఆ సందర్భంగా ఎం.శ్రీరామమూర్తి ఇంగ్లీషులో ప్రశంసాపద్యాలు రాసి ఆ ప్రశంసాపత్రాన్ని సమర్పించారు. రవీంద్రుడి శత జయంతికి అప్పటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి విశేష ప్రత్యేక సంచిక ప్రచురించింది. రవీంద్రుడి రచనల తెలుగు అనువాదాలను వెలువరించింది.

గీతాంజలిలో ఆధ్యాత్మికత, ప్రకృతి ప్రేమ ముఖ్యమైన అంశాలు. కవి తన కవితల్లో దైవం, ఆత్మ, ప్రకతితో ఉన్న అనుబంధాన్ని అద్భుతంగా వర్ణించాడు. అంతేకాకుండా తన కాలపు సామాజిక సమస్యలపై కూడా కవితల్లో ప్రస్తావించారు. అణగదొక్కబడిన వర్గాల పట్ల, స్త్రీల స్థితి గురించి తన ఆందోళనను వ్యక్తం చేశారు. గీతాంజలిలోని కొన్ని పద్యాలకు ఠాగూర్ స్వయంగా సంగీతం కూడా సమకూర్చారు. ఈ పాటలు ఇప్పటికీ ప్రజలచే ప్రాచుర్యం పొంది ఉన్నాయి.

ఆ తర్వాత గీతాంజలి ఇంగ్లీష్, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, ఇటాలియన్, రష్యన్, చైనీస్, జపనీస్, అరబిక్, అనేక ఇతర భాషల్లోకి అనువాదం అయింది. గీతాంజలిని చలంతో సహా అనేక మంది తెలుగు కవులు తెలుగులోకి అనువదించారు. 21 తెలుగు అనువాదాలు వరకూ అందుబాట్లో ఉన్నాయి. గీతాంజలి – భారతీయ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసిన ఒక గొప్ప కృతి. మనిషి కేంద్రంగా భాసించే విశాల మానవతా స్వేచ్ఛా సౌభ్రాతృత్వపు శాంతి పతాక కూడా!

– రేగుళ్ళ మల్లికార్జునరావు
సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ

(మే 7 : రవీంద్రనాథ్ టాగూర్ జయంతి. చక్కని చిత్రకారుడు కూడా అయిన ఈ వ్యాసకర్త గీతాంజలిని తెనిగించి, ప్రతి గీతానికి ఒక అందమైన చిత్రాన్ని భావస్ఫోరకంగా చిత్రించారు. అది త్వరలో పుస్తకరూపంలో రానున్నది.)

'పాడుదమా స్వేచ్ఛాగీతం' ప్రాసంగికత



కళింగాంధ్ర కవి, కథకుడు, పాటల రచయిత గంటేడ గౌరునాయుడు మాస్టారు రాసిన 'పాడుదమా స్వేచ్ఛాగీతం' పాట మూడు దశాబ్దాల పైబడి అది పుట్టిన విజయనగరం జిల్లా, గుమ్మలక్ష్మీపురం మండలం, రేగిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను దాటి ఎంతగా వ్యాప్తి చెందిందో లోకానికి తెలిసిన విషయమే.

ప్రతి సంవత్సరం ప్రధానంగా ఆగస్టు 15, జనవరి 26 సందర్భాలలో రాష్ట్రంలో, రాష్ట్రం దాటి తెలుగు ప్రాంతాల్లోనూ ఎక్కడో ఒక చోట 'పాడుదమా స్వేచ్ఛాగీతం' మారుమ్రోగకుండా వుండదు. అంతగా ఈ పాట జనబాహుళ్యంలోకి చొచ్చుకుని వెళ్లింది.

ఇప్పుడు ఈ వర్తమానంలో 'పాడుదమా స్వేచ్ఛాగీతం' పాట ప్రాసంగికత ఏమిటి? అనేది ఒకటి నిర్దేశించుకోవాల్సిన సందర్భం ఒకటి నిజంగా మనముందుకొచ్చి నిలిచింది. ముఖ్యంగా గత పదేళ్లుగా భారతదేశంలో పెచ్చురిల్లుతున్న హిందుత్వ ఆధిపత్య భావజాల వ్యాప్తి సందర్భంలో ఈ పాటకున్న పరిమితులు, పరిధులు పక్కనపెట్టి– దాని ప్రాసంగికతను తప్పకుండా గుర్తించి తీరాలి. అది ఈనాటి అవసరం కూడా. ఏ చిన్న చైతన్యాన్నైనా దగ్గరకు తీసుకోవాల్సిన బాధ్యత ఒకటి ఇప్పుడు మన ముందు వుంది. ఈ సందర్భంలో 'పాడుదమా స్వేచ్ఛాగీతం' పాట అందించిన చైతన్య స్థాయి పెద్దదే అని చెప్పాలి.

భారత రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుధర్మాన్ని ప్రతిష్ఠించడమనే పనిలో కదిలిపోతున్న హిందుత్వ రాజకీయాలకు ఎదురు నిలవడం అనే కార్యాచరణలో ఈ పాట పోషించాల్సిన పాత్ర ముఖ్యమైనదనే చెప్పాలి. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో స్వాతంత్ర్య నాయకులు పోషించిన పాత్రని నెమ్మది నెమ్మదిగా తొలగించే దురుద్దేశంలో సాగుతున్న ఉన్మాదులకు ఈ పాట కొంత మేరకు చెంపపెట్టే.

ఈ పాట ఎత్తుగడలోనే గొప్ప భావప్రవాహం కలిగి వుంది. 'పాడుదమా స్వేచ్ఛాగీతం' అని ఎక్కడ ఏ దేశంలో ఎవరు గొంతెత్తి పాడినా అది సృష్టించే ప్రభంజనం సాధారణమైనది కాదు. ప్రపంచ సాహిత్య సంగ్రామ చరిత్రలో ఒక పదం లేదా ఒక వాక్యం చాలు జన సమూహాన్ని ముందుకు నడిపించడానికి– ఆ శక్తి ఈ పాట ఎత్తుగడ వాక్యంలోనే వుంది.

ఆధునిక కాలంలో దేశంలో అనేకచోట్ల జలియన్ వాలా బాగులు జరుగుతున్న సందర్భంలో– గౌరునాయుడు మాస్టారు రాసిన ఈ పాటలోని ఒకటో చరణం 'జలియన్ వాలా బాగు దురంతపు/ నెత్తుటిధారల నొత్తుకొని/ ఉరికొయ్యల చెరసాలల గోడల/ దారుణాలు తలకెత్తుకొని' ఆ పొగిలిన పోరాడిన కాలాన్ని తలచుకొని హృదయంలో నింపుకొని స్వేచ్ఛాగీతం పాడుదాం అని అంటారు. ఈ స్ఫూర్తిని ఇప్పుడు అందుకోవాల్సి వుంది.

రెండో చరణంలో 'వందేమాతరమని నినదించిన/ వీరుల శౌర్యము నలదుకొని/ స్వాతంత్ర్యం నా జన్మహక్కని/ గర్జించిన గళమందుకొని' అని స్వాతంత్ర్య సందర్భం ఇచ్చిన పోరాట బలాన్ని కలకాలం కాపాడుకోవాలని ఉద్బోధిస్తాడు ఇక్కడ కవి. ముందే చెప్పినట్టు ఈ పాటకి పరిమితులు వున్నా సరే– ఇప్పటి సంక్షోభకాలానికి ఎదురొడ్డి నిలబడడానికి ఇలాంటి ఒక పాటని ఆయుధంగా మలుచుకోవాల్సిన సందర్భం ఒకటి ఎదురుచూస్తూ వుందనేది వాస్తవం.

ఈ పాటంతట్లోకి పరిమితులను చెరిపి బలంగా నిలిచిన చరణం మూడో చరణం. ఈ చరణం రగిలించిన స్ఫూర్తి చాలా ప్రభావశీలమైనది. 'మన్నెం గుండెల మంటై రగిలిన/ విప్లవజ్యోతి స్ఫూర్తియని/ గుండుకెదురుగా గుండెను నిలిపిన/ తెలుగు సింగముల తెగువ గని' ఇలా ప్రగతి దారిలో సాగిన చరణం– 'చీకటిగుండెల బాకై మెరిసిన/ గరిమెళ్లను గురుతుంచుకొని' అని స్వేచ్ఛాగీతం పాడాలని ప్రకటిస్తుంది. చివరిదైన నాలుగో చరణంలో 'జండా గాథలు చెప్పుకొని/ జయగీతమ్ములు పాడుకొని' అని 'పాడుదమా స్వేచ్ఛాగీతం' పాట ఎలుగెత్తుతుంది.

ముప్పై ఐదేళ్ల కిందట ఒక పాఠశాల ఆవరణంలో ప్రాణం పోసుకున్న ఈ పాట దానిదైన పాత్రని అది నిర్వహించిందని, ఇప్పుడు ఈ జటిల రాజకీయ సామాజిక వాతావరణంలో ఒక సరికొత్త పాత్రను నిర్వహించాల్సిన సందర్భం ఒకటి వచ్చిందని ఒక ప్రజాస్వామిక పౌరునిగా నేను భావిస్తున్నాను.

ఈ పాట పుట్టుక పరిణామాన్ని ఒకసారి అవలోకనం చేసుకుంటే ఇంకో విషయాన్నీ రూఢీ పరుస్తుంది. దుర్మార్గ నిచ్చెనమెట్ల వర్ణవ్యవస్థ ఒకటి సాగుతున్న ఒక విలోమకాల ప్రయాణంలో ఒక బహుజనుడు, ఒక శ్రామికవర్గ సృజనకారుడు నుంచి ఈ పాట పుట్టడం అనేది చైతన్యశీలమైన సామాజిక మార్పుని మన ముందు తేటపరుస్తుంది. ఈ విధంగా రెండు కోణాల్లో ఈ పాటకు వర్తమానంలో ప్రాసంగికత వుందని నేను బలంగా చెప్పదలుచుకున్నాను.

– బాలప్ప

వర్తమానంపై సృజనాత్మక అస్త్రం

పుస్తకం

అర్థం మారిపోయిన దేశభక్తి, హద్దులు మీరిన మూఢ భక్తి, పెరిగిన ధనిక బీద అంతరాలు, పెచ్చుమీరిన స్త్రీ పురుష వివక్ష సమాజంలో బతుకుతున్న ఆలోచనాపరులను స్థిమితంగా ఉండనివ్వడం లేదు. తమలో రగులుతున్న జ్వాలలను అక్షరాలుగా మార్చి కథలుగానో కవిత్వంగానో ప్రజలకందిస్తారు. అలాంటి రచయిత దేశరాజు రచించిన కథా సంపుటి 'రొమాంటిక్ డాగ్'. ఈ పుస్తకం పేరు చూసి దీనిలో ఏవో రొమాంటిక్ కథలుంటాయని ఆశపడినవారిని నిరాశపరుస్తాయి దీనిలోని కథలు. దీనిలో వున్న డజను కథలూ ఆలోచనలను రగుల్కొలిపే కథలే!

ఎంతగా 'సర్దుకుపో' మంత్రం వల్లె వేసినా, భర్త చేసిన దారుణానికి కోర్టులో కేసు పెడ్తుంది భార్య. కానీ ఆనవాయితీ ప్రకారం, న్యాయదేవత గుడ్డిది కాబట్టి కేసు ఓడిపోతుంది. ఆ భార్య కథే 'ఓ తల్లి తీర్పు'. 'కొత్త రెక్కలు' కథ పెట్టుబడిదారీ వర్గాలకీ, శ్రామికులకీ గల తేడాను చెప్పిన కథ. ధనికులు ఎప్పుడూ తమ కింద పనిచేసేవారు తరతరాలుగా అలాగే తమకు చాకిరీ చేస్తూ తమకింద కుక్కల్లా అణకువగా పడివుండాలని కోరుకుంటారు. వాళ్లు కష్టపడి, చెమటోడ్చి బతుకుతున్నా ఓర్వలేరు. కానీ, కష్టపడి పని చేసే వాళ్లు వాళ్లకింద చాకిరీ చేస్తూ ఎల్లకాలం బతకాలనుకోరు. అలాంటి వాళ్లను తప్పించుకొని రెక్కలున్నాయి కాబట్టి మరోచోటికి ఎగిరిపోతారు ఆత్మవిశ్వాసంతో తమ రెక్కల సత్తువను నమ్ముకుని. ఈ సంపుటి పేరు గల కథ 'రొమాంటిక్ డాగ్', ఆధునిక భారతదేశ ముఖ చిత్రకథ అని చెప్పవచ్చు. పైకి రెండు కుక్కల కథ అనిపిస్తుంది. కానీ, ఒక మగ కుక్క ఆడకుక్కను కలవడానికి రోడ్డు మీద పడ్డ పాట్లే ఈ కథా సారాంశం. మన దేశంలో మితిమీరిన భక్తిని గురించిన వ్యంగ్య కథనం ఈ కథ. ఇది చదువుతున్నప్పుడు కుంభమేళా తొక్కిసలాటలో ప్రజలు ప్రాణాలు కోల్పోయిన సంఘటన గుర్తుకు వస్తుంది. ఈ కథా సంపుటిలో మరో ముఖ్యమైన కథ 'రేటింగ్'. ఈనాటి పోటీ ప్రపంచంలో అన్నిటికీ పోటీయే. టీవీ ఛానెల్స్‌కీ, వస్తువులకీ, అన్నింటికీ రేటింగ్స్. ఛానెల్స్ ను ఎక్కువమంది చూస్తే రేటింగ్ వుంటుంది. అలాగే ఏ పని అయినా బాగా చెయ్యాలి. అప్పుడు దానికి రేటింగ్ పెరుగుతుంది. మధ్య తరగతి కుటుంబాలు, వాళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, అక్కడి రేటింగ్‌లు, ఆ పోటీ ప్రపంచంలో ఉద్యోగుల మనస్తాపాలు, ఆఖరికి బాత్ రూములు కడిగినా, ఏ పని చేసినా మంచి రేటింగ్ ఇమ్మని అడిగే వాళ్లు.. ఇలా ఆధునిక టెక్నాలజీ ప్రపంచాన్ని ఆవిష్కరించిన కథ ఇది. రూపాయి వస్తువుకి పది రూపాయల ప్రచారం చేస్తున్న ఈ రోజుల్లో ఈ కాలాన్ని ప్రతిబింబించిన కథ ఇది. ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లోని బాత్రూమ్ శుభ్రం చేయడానికి ఒక కంపెనీ తరపున భార్యాభర్తలు వస్తారు. అతడు వీళ్లని అనుమానాస్పద దృష్టితో చూస్తాడు. కథంతా అయ్యే సరికి పనివాళ్ల నిజాయితీని తెలుసుకొంటాడు. వాళ్లు కష్టపడి పని చేసినా వచ్చిన ప్రతిఫలంలో కొంత పర్సంటేజ్ ఆ కంపెనీ వాళ్లు తీసుకొంటారని చెప్పినప్పుడు జాలిపడతాడు. బాత్రూమ్ అద్దంలా కడిగిన ఆ అబ్బాయి చివరకి వాళ్లు చేసిన పనికి మంచి రేటింగ్ ఇమ్మని అడగడం ఈ కథకి కొసమెరుపు.

మరో కథ 'సిగ్నల్స్' చాలా చిన్న కథ ఐనప్పటికీ మంచి ప్రభావవంతమైన కథ. మానవ సంబంధాలన్నీ కనుమరుగైపోతున్న ఈ కాలాన్ని ఈ కథలో ఒడిసి పట్టుకున్నారు రచయిత. ఒకప్పుడు సిగ్నల్స్ లేక మాట్లాడుకోలేకపోయారు. ఇప్పుడు సిగ్నల్స్ వున్నా మాట్లాడే వారు లేకపోవడం ఈ కథలోని విషాదం. ఇప్పుడు ఒకళ్లో ఇద్దరో పిల్లలున్నా వాళ్ల రెక్కలు విప్పి ఎగిరి వాలేది అమెరికాలోనో, ఆస్ట్రేలియాలోనో. తల్లిదండ్రులు మరణించినా రాలేనంత దూరంలో వుంటారు. నెలనెలా డాలర్లు పంపిస్తారుగానీ స్పర్శను పంపించలేరు. ఎక్కడ చూసినా ఫోన్‌లో మాట్లాడటమే కానీ మనుషులతో మాటలాడతారో లేదో సందేహమే. బండి నడుపుతూ, భోజనం చేస్తూ, స్నానం చేస్తూ, కాలకృత్యాలు తీర్చుకుంటూ ఫోన్ మాటలాడతారుగానీ బతికున్న అమ్మమ్మతోనో, నాయనమ్మతోనో మాట్లాడరు. ఇప్పుడు నడుస్తున్నది మాటలు లేని రుతువులే! పిల్లల మాటలకు నోచుకోక, వారి స్పర్శ దొరకక ప్రతిక్షణం నరకంగా బతుకుతుంటారు. ఇక పల్లెటూళ్లలో కూడా తాళాలేసిన ఇళ్లు, వృద్ధులు మాత్రమే మిగిలిన ఇళ్లు ఒక వర్తమాన వాస్తవం. ఇవన్నీ చూస్తే మనసు చెమరించక మానదు. ఇలా సంపుటిలో ఏ కథకు ఆ కథ సంక్లిష్ట ఆధునిక మానవ జీవితంలోని ఒంటరితనాన్ని, అదృశ్య విషాదాన్ని ఆవిష్కరిస్తుంది. 'లోగుట్టు' కథ ఓ విలక్షణమైన కథ. పితృస్వామ్య సమాజంలో స్త్రీ పురుషుల వివక్ష చాలా ఎక్కువ. సినిమాల్లో, రాజకీయాల్లో, కుటుంబంలో ఇద్దరి మధ్య తేడా లెక్కువ. వయస్సు విషయంలో, వస్త్రధారణలో, ప్రవర్తనలో అడుగడుగునా కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది ఈ అంతరం. సినిమాల్లో హీరోకి అరవైలు వచ్చినా ఇరవైల అమ్మాయితో డ్యూయట్ లు పాడతాడు. 40 ఏళ్లు వస్తే హీరోయిన్ అమ్మ పాత్రలకే పరిమితం. నాయకుణ్ణి మాత్రం నవయువకుడు అని కీర్తిస్తారు. ఇక అరవైలు, డెబ్బైలు వస్తే స్త్రీలని రామా కృష్ణా అనుకుంటూ మూల కూర్చోమంటారు. పెళ్లిళ్లకు పేరంటాలకు వెళ్లేటప్పుడు శ్రద్ధగా అలంకరించుకున్నా వేళాకోళం చేస్తారు, ముసలి వాళ్లకు దసరా పండగ అని. ఈ కథలో ఒక 70 ఏళ్ల అమ్మ పెళ్లికి వెళ్లడానికి శ్రద్ధగా తయారవుతుంది. ఆ నేపథ్యంలో వచ్చిన ఈ కథ చదివాక బయటకు వెళ్లేటప్పుడు ఏ వయసువారైనా చక్కగా, హుందాగా వుంటే బాగుంటారనిపిస్తుంది.

ఈ సంపుటిలోని కథలన్నీ మెదడుకి పదును పెట్టేవే. కదిలేదీ కదిలించేది కవిత్వమని అంటారు. కథలు కూడా అంతే. కథ చదివాక హృదయాన్ని కదిలించాలి. ఈ సంపుటిలోని కథలన్నీ అలాంటివే. ఇలాంటి విశిష్ట కథలను అందించిన దేశరాజుకి హృదయపూర్వక అభినందనలు.

– మందరపు హైమవతి
94410 62732

దేశభక్తి ఒక ఆచరణ

దేశభక్తి అంటే
దేశ చిత్రపటానికి మొక్కడమో..
భక్తి గీతాలు పాడడమో..
జెండాలు పట్టుకు ఊరేగడమో కాదు!
గత పోరాటాల స్ఫూర్తిని
గుండెల్లో నింపుకోవడం!
త్యాగాల ద్వారా సాధించుకున్న
ప్రజాతంత్రాన్ని నిలుపుకోవడం!

ప్రజలు రాసిచ్చుకున్న రాజ్యాంగానికి
రక్షణగా నిలవడం
చిత్తశుద్ధితో దాన్ని అమలు చేయడం!
సార్వభౌమత్వాన్ని నిలపడం..
సామ్యవాదం వైపు సాగడం!
లౌకిక భావనకు విలువివ్వడం!

దేశ సంపదను, సహజ వనరులను
పరాయిపాలు కాకుండా చూడడం
ప్రభుత్వ సంస్థలు/ ఆస్తులు
కార్పొరేట్ చేత చిక్కకుండా చేయడం

మితిమీరిన పన్నుల పేరిట
ప్రజల నడ్డి విరవకపోవడం!
ప్రజల స్వావలంబనకు
ఆలంబనగా నిలవడం!
పదవుల కోసం నానా గడ్డి కరవకపోవడం!
అధికారం కోసం
అడ్డదారులు తొక్కకపోవడం!
మీది మిక్కిలి..
చట్టాన్నీ, రాజ్యాంగాన్ని మీరిన వారికి
నీ ఓటుతో తాట తీయడం
నికార్సైన ప్రజాస్వామ్య పౌరుడిగా మెలగడం ...

– రాము ఉప్పాడ
96760 51509

రూ.40 లక్షలకు నీట్ పేపరు? : ముగ్గురి అరెస్టు

జైపూర్ : రూ.40 లక్షలకు నీట్ ప్రశ్నాపత్రం విక్రయిస్తామని ఒక అభ్యర్థిని మోసం చేయడానికి ప్రయత్నించిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు రాజస్థాన్ పోలీసులు ఆదివారం వెల్లడించారు. నిందితులను బల్వాన్ (27), ముఖేష్ మీనా (40), హర్దాస్ (38)గా గుర్తించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం నిందితులు శుక్రవారం ఒక అభ్యర్థిని, అతని కుటుంబ సభ్యులను గురుగ్రామ్‌కు తీసుకెళ్లి డబ్బులు డిమాండ్ చేశారు. అభ్యర్థి కుటుంబం తమకు ప్రశ్నాపత్రం చూపించమని కోరింది. దీనికి నిందితులు అంగీకరించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసుల్ని సంప్రదించారు. శనివారం వీరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఒడిషాలోని వైద్య కళాశాలలో అడ్మిషన్ల కోసం అభ్యర్థుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలతో అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

Bank of Baroda — చింతగుంపల్లి బ్రాంచి
డి.నెం.39, చింతగుంపల్లి గ్రామం, చినగంజాం మండలం, బాపట్ల జిల్లా-523181, ఫోన్: 8977513940
Mail: VJCHGU@bankofbaroda.com

ఋణగ్రహీతకు సంక్షిప్త నోటీసు

ఇందుమూలముగా యావన్మందికీ మరియు ఋణగ్రహీత: కొమ్ము ప్రేమ్‌కుమార్(అభ్యర్థి), కొమ్ము తారా (సహ-అభ్యర్థి),17-84, హరిజనపాలెం, వేటపాలెం, బాపట్ల జిల్లా-523187 తెలియజేయునది ఏమనగా ది.19-10-2023 నాటి అమోద లేఖ ప్రకారం బ్యాంక్ మీకు ఋణసౌకర్యమును మంజూరు చేసియున్నది. బకాయిలు చెల్లించవలసినదిగా ది.25-02-2025 & ది.19-04-2025 తేదీలలో మేము నోటీసులు పంపిననూ గడువులోగా బకాయిని చెల్లించుటలో మీరు విఫలమైనందున మీ యొక్క ఋణ ఖాతాను ఆర్‌బిఐ వారి మార్గదర్శకాల ప్రకారం ది.10-04-2025న నిరర్థక ఆస్థిగా పరిగణింపబడినది.

ఋణ ఖాతా నెం.: 82320600008033 **ఋణం మొత్తం: రూ.7,90,000/-**
బకాయి మొత్తం: రూ.6,34,643/- **అప్‌గ్రేడేషన్ మొత్తం: రూ.67,040.43**

ఈ నోటీసు ప్రచురింపబడిన వెంటనే మీరు మొత్తం **రూ.67,040.43పై॥ (అక్షరాల అరవైఏడు వేల నలభై రూపాయలు మరియు నలభై మూడు పైసలు మాత్రము)** మొత్తాన్ని చెల్లించవలెను. మీరు చెల్లించుటలో విఫలమైన యెడల హైపోథికేటెడ్ ఆస్తులను స్వాధీనం చేసుకొనుటకు మరియు హైపోథికేటెడ్ ఆస్తులకు సంబంధించి ఇతర చర్యలను తీసుకొనుటకు బ్యాంకుకు అధికారం కలదు. బకాయి రాబట్టుకొనుటకు గానూ హైపోథికేటెడ్ ఆస్తులను విక్రయించవలెను, అయిననూ బకాయి తీరని యెడల చట్టపరమైన చర్యలు తీసుకొనబడును అని తెలియజేయడమైనది.

DESCRIPTION OF THE VEHICLE	
Vehicle type	Motor Car (LMV)
Registration No.	AP40AZ9997
Chassis No.	MA3CZFB3SPK834002
Engine No.	K12NN1021372
Makers Name	Maruti Suzuki India Ltd
Model Name	Dzire VXI
Fuel type	Petrol
Color	Pearl Arctic White

గమనిక: ది.25-02-2025న ఋణగ్రహీతకు పంపిన నోటీసు బట్వాడా చేయబడలేదు మరియు ది.19-04-2025న పంపిన నోటీసు తిరిగి వచ్చినందున ఈ పత్రికా ప్రకటన జారీచేయడమైనది.
స్థలం : చింతగుంపల్లి, తేది : 03-05-2025
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా.

కెనరా బ్యాంక్ Canara Bank — ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. M/s నవ్య ట్రేడర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: సురగాని జ్యోతి కుమారి, డి.నెం. 6/369 (మేడమీద), చీరాల రోడ్డు, యన్‌టిఆర్ సెంటర్, చిలకలూరిపేట, గుంటూరు, పిన్ కోడ్ – 522616.
2. శ్రీమతి సురగాని జ్యోతి కుమారి, భర్త: సూరగాని పోతురాజు, ఫ్లాట్ నెం. 201, వెంకట సాయి అపార్ట్‌మెంట్స్, విద్యాపురి కాలనీ, గుంటూరు.
3. శ్రీ సూరగాని పోతురాజు, తండ్రి: యస్. వెంకటేశ్వర్లు, ఫ్లాట్ నెం. 201, వెంకట సాయి అపార్ట్‌మెంట్స్, విద్యాపురి కాలనీ, గుంటూరు.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ రూల్స్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి నోటీసు.

కెనరా బ్యాంక్, ఎఆర్‌ఎమ్ బ్రాంచ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) సెక్షన్ 13(8) క్రింద చదవబడు రూల్ 8(6) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 రూల్స్ (ఇక మీదట "రూల్స్"గా రిఫర్ చేయబడును) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత/సంస్థ M/s **నవ్య ట్రేడర్స్, తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు)** వారిని లోను అకౌంట్‌కు సంబంధించిన బకాయి **రూ. 2,38,09,125 (అక్షరాల రెండు కోట్ల ముప్పై ఎనిమిది లక్షల తొమ్మిది వేల నూట ఇరవై ఐదు రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద 19.09.2017 తేదిన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత/సంస్థ తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **తేది. 31-01-2018**న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక **స్వాధీనం తీసుకున్నారు** మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును రెండు ప్రముఖ వార్తాపత్రికలలో తేది 04.02.2018న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **30.04.2025** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.7,71,48,335.81 (అక్షరాల ఏడు కోట్ల డెబ్బై ఒకటి లక్షల నలభై ఎనిమిది వేల మూడు వందల ముప్పై ఐదు రూపాయలు మరియు ఎనభై ఒకటి పైసలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002, నందలి రూల్ 8(6) ప్రకారం మీకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటీ. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు. చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు

ఆస్తి నెం-1: గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్-డిస్ట్రిక్ట్, ఈదులపాలెం గ్రామం మరియు గ్రామ పంచాయితీ, డి.నెం. 15/1, ప్లాట్ నెం.10, సేల్‌డీడ్ నెం. 2480/2015, తేది 11.06.2015 ప్రకారం శ్రీమతి సురగాని జ్యోతికుమారి గారి పేరుగనల **484 చ॥గ॥ల ఖాళీ స్థలం. హద్దులు డీడ్ ప్రకారం.**
ఆస్తి నెం-2: గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్-డిస్ట్రిక్ట్, ఈదులపాలెం గ్రామం మరియు గ్రామ పంచాయితీ, డి.నెం. 15/1, ప్లాట్ నెం.9, సేల్‌డీడ్ నెం. 2483/2015, తేది 11.06.2015 ప్రకారం శ్రీ సురగాని పొతురాజు గారి పేరుగనల **484 చ॥గ॥ల ఖాళీ స్థలం. హద్దులు డీడ్ ప్రకారం.**
ఆస్తి నెం-3: గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్-డిస్ట్రిక్ట్, ఈదులపాలెం గ్రామం మరియు గ్రామ పంచాయితీ, డి.నెం. 15/1, ప్లాట్ నెం.4, సేల్‌డీడ్ నెం. 2484/2015, తేది 11.06.2015 ప్రకారం శ్రీ సురగాని పొతురాజుగారి పేరుగనల **484 చ॥గ॥ల ఖాళీ స్థలం. హద్దులు డీడ్ ప్రకారం.**

తేది: 30.04.2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank — ఎఆర్‌ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, రింగ్ రోడ్డు, విజయవాడ-520008.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. మెస్సర్స్ ఓం సాయి రామ్ ఎంటర్‌ప్రైజెస్, ప్రొప్రయిటర్: శ్రీ ఎస్. చంద్ర శేఖర బాబు, ఫ్లాట్ నెం. 557, [illegible]

తేది: 30.04.2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఇజ్రాయిల్ విమానాశ్రయంపై
హౌతీ తిరుగుబాటుదారుల క్షిపణి దాడి

- టెల్ అవీవ్‌కు సర్వీసులు నిలిపివేసిన ఎయిర్ ఇండియా

టెల్ అవీవ్ : ఇజ్రాయిల్‌లోని ప్రధాన విమానాశ్రయం టెల్ అవీవ్‌లోని బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఆదివారం ఉదయం క్షిపణి దాడి జరిగింది. యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ప్రయోగించిన ఈ క్షిపణి విమానాశ్రయ మూడవ టెర్మినల్‌కు కేవలం 75 మీటర్ల దూరంలో పడింది. విమానాశ్రయం యాక్సెస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న తోటలో ఈ క్షిపణి పడింది. దీంతో అక్కడ 25 మీటర్ల లోతైన గొయ్యి ఏర్పడింది. ఈ దాడిలో ఎనిమిది మంది గాయపడ్డారు. విమానాశ్రయంలో కార్యకలాపాలకు దాదాపు గంటసేపు ఆటంకం కలిగింది. ప్రయాణికులు భయంతో పరుగులు తీశారు. నాలుగు అంచెల ఇజ్రాయిల్ వాయు రక్షణను దాటుకుని, దేశంలోని అత్యంత సున్నితమైన విమానాశ్రయం పరిసరాల్లో క్షిపణి పడటం ఇజ్రాయిల్ అధికారుల్లో ఆందోళన కలిగిస్తుంది. క్షిపణిని అడ్డుకునేందుకు తాము చేసిన అనేక ప్రయత్నాలు విఫలమయ్యాయని, విమానాశ్రయంలో పడిన తరువాత దట్టమైన పొగలు అలముకున్నాయని ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడిఎఫ్) తెలిపాయి. గాజా స్ట్రిప్‌పై సైనిక కార్యకలాపాలను మరింత తీవ్రతరం చేయాలా.. వద్దా.. అనే విషయంపై నిర్ణయం తీసుకోవడానికి ఇజ్రాయిల్ క్యాబినెట్ మంత్రులు ఆదివారం సాయంత్రం సమావేశం కానుండగా ఈ క్షిపణి దాడి జరగడం గమనార్హం. ఈ దాడిపై హౌతీ సైనిక ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ యాహ్యా సారీ ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. ఇజ్రాయిల్ విమానాశ్రయంపై తమ బృందం హైపర్‌సోనిక్ బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించిందని తెలిపారు.

క్షిపణి దాడితో ఇజ్రాయిల్ విమానాశ్రయం సమీపంలో ఏర్పడిన భారీ గుంత

సర్వీసులు రద్దు చేసిన అంతర్జాతీయ విమానయాన సంస్థలు

ఈ క్షిపణి దాడి తరువాత అనేక అంతర్జాతీయ విమానయాన సంస్థలు ఇజ్రాయిల్‌కు తమ సర్వీసులను రద్దు చేశాయి. ఢిల్లీ నుంచి టెల్ అవీవ్‌కు ఆదివారం వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానాన్ని అబుదాబికి మళ్లించారు. ఈ నెల 6 వరకూ టెల్‌అవీవ్‌కు సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది.

ఎన్నికల డేటాపై కొత్త డిజిటల్ ఇంటర్‌ఫేస్

- ప్రకటించిన ఇసి

న్యూఢిల్లీ : ఓటర్లు, పోల్ అధికారులు, రాజకీయ పార్టీల కోసం ఎన్నికల సంఘం కొత్త డిజిటల్ ఇంటర్‌ఫేస్‌ను అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే 40కి పైగా మొబైల్, మరికొన్ని వెబ్ అప్లికేషన్‌లను అనుసంధానం చేసింది. ఈ డిజిటల్ ఇంటర్‌ఫేస్ ద్వారా ఎన్నికలకు సంబంధించిన అన్ని కార్యకలాపాలను ఇసిఐనెట్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉందని పోల్ ప్యానెల్ ఆదివారం తెలిపింది. ఈ కొత్త ఫ్లాట్‌ఫారమ్ ద్వారా వినియోగదారులపై ఒత్తిడి తగ్గుతుందని పోల్ ప్యానెల్ వెల్లడించింది. బహుళ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం, క్రాస్ చెక్ చేయడం, వివిధ రకాల లాగిన్‌లను గుర్తుంచుకోవడం వంటివి వినియోగదారులపై పడే భారాన్ని ఈ కొత్త ప్లాట్‌ఫామ్ తగ్గిస్తుంది. ఇటీవల జరిగిన ప్రధాన ఎన్నికల అధికారుల సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఈ ప్లాట్‌ఫామ్‌ను ప్రతిపాదించారు. ఆయన ప్రతిపాదన మేరకు ఈ కొత్త ప్లాట్‌ఫామ్‌ను ఎన్నికల సంఘం అభివృద్ధి చేసింది. ఎన్నికల డేటాను వినియోగదారుల డెస్క్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లకు యాక్సెస్ చేయడానికి వీలు కల్పిస్తుంది. ఈ డేటాను ఎన్నికల సంఘం అధికారి మాత్రమే నమోదు చేస్తారు.

ఇడి అధికారాలపై విచారణకు ముగ్గురు న్యాయమూర్తులతో ధర్మాసనం

న్యూఢిల్లీ : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారాలను సమర్థిస్తూ 2022లో ఇచ్చిన తీర్పును పున:పరిశీలించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణకు ముగ్గురు జడ్జిలతో కూడిన ధర్మాసనాన్ని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.కొటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను ఈ నెల 7 నుంచి విచారించనుంది. గతంలో ఈ ధర్మాసనాన్ని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ సిటి రవికుమార్‌లతో ఏర్పాటు చేసింది. వీరిలో జస్టిస్ రవికుమార్ జనవరి 5న పదవీ విరమణ చేశారు. దీంతో మార్చి 6 నుంచి జరగాల్సిన పిటిషన్ల విచారణ నిలిచిపోయింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద సోదాలు, ఆస్తిని స్వాధీనం చేసుకోవడం, వ్యక్తులను అరెస్టు చేయడం వంటి అధికారాలు ఇడికి ఉంటాయని సమర్థిస్తూ 2022 జులైలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అదే సంవత్సరం ఆగస్టులో ఈ తీర్పును సమీక్షించాలని కోరుతూ అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఇసిఐఆర్), పోలీసులు నమోదు చేసే ఎఫ్ఐఆర్ ఒక్కటి కాదని పిటిషన్‌దారులు వాదించారు. దీంతో ఈ పిటిషన్ల విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించింది.

బెంగాల్‌లో కేంద్రం జోక్యం చేసుకోవాలి

- రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్రానికి గవర్నర్ నివేదిక

న్యూఢిల్లీ : వక్ఫ్ సవరణ చట్టం నేపథ్యంలో ముర్షిదాబాద్‌లో అల్లర్లను సాకుగా తీసుకుని పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని ఆ రాష్ట్ర గవర్నర్ సివి ఆనందబోస్ కేంద్రానికి నివేదిక పంపించారు. ప్రముఖ ఆంగ్ల పత్రిక 'ది హిందూ'కు లభించిన వివరాల ప్రకారం గవర్నర్ మూడు సిఫారసులు చేశారు. వక్ఫ్ సవరణ చట్టం అమలులోకి వచ్చిన అనంతరం ముర్షిదాబాద్‌లోని ధులియన్, సంసెర్‌గంజ్ ప్రాంతాల్లో ఏప్రిల్ 11, 12 తేదీల్లో జరిగిన అల్లర్లలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది నిరాశ్రయులయ్యారు. ఈ పరిస్థితిని అదుపు చేయడానికే కాకుండా, చట్టపాలనపై ప్రజలకు విశ్వాసం కలిగించడానికి రాజ్యాంగపరమైన ఎంపికలను పరిగణనలోకి తీసుకోవాలని గవర్నర్ సూచించారు. రాష్ట్ర యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయడంలో విఫలమైనప్పుడు శాంతిభద్రతలను కాపాడుకోవడానికి కేంద్రప్రభుత్వానికి అధికారం ఇచ్చేలా ఒక సమగ్ర చట్టాన్ని రూపొందించాలని కూడా ఆయన సిఫారసు చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలను నివారించడానికి చర్యలను సూచించడానికి 1952 కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ చట్టం కింద విచారణ కమిషన్‌ను నియమించాలని నివేదికలో పేర్కొన్నారు. అల్లర్ల ప్రభావిత ప్రాంతాల్లో సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్) అవుట్‌పోస్టులను ఏర్పాటు చేయాలని తెలిపారు.

అంతేకాకుండా తన నివేదిక చివరిలో సిఫార్సుగా పేర్కొనకుండా, ఒక రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని సూచించే ఆర్టికల్ 356 గురించి గవర్నర్ ప్రస్తావించారు. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద ఉన్న నిబంధనలు కూడా అలాగే ఉన్నాయి' అని పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాలు మతం ఆధారంగా మారాయని, అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పెరుగుతున్న రాజకీయ శత్రుత్వం రెండు ప్రధాన పార్టీలు తమ ఓటింగ్‌ను ఏకీకృతం చేసుకోవడానికి మతపరమైన గుర్తింపును పెంచుకోవడానికి దారితీస్తోందని ఆ నివేదికలో వివరించారు. ఈ సమస్యలు మతపరమైన ఉద్రిక్తతలను కారణమవుతున్నాయని, రాష్ట్రంలో ద్వేషపూరిత ప్రసంగాలను అరికట్టడంలో, శాంతిభద్రతలను నిష్పాక్షికంగా అమలు చేయడంలో విఫలమవడంతో ఈ పరిస్థితులు తీవ్రతరమవుతాయని గవర్నర్ పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, సంఘ్ పరివార్ ఒక పథకం ప్రకారం రాష్ట్రంలో అల్లర్లను ప్రేరేపిస్తుండగా, రాష్ట్రపతి పాలన విధించాలని గవర్నర్ నివేదిక పంపించడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇమ్రాన్‌ఖాన్, బిలావల్ భుట్టో ఎక్స్ అకౌంట్స్ భారత్‌లో బ్లాక్

ఇస్లామాబాద్ : పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్, మాజీ విదేశాంగ మంత్రి బిలావల్‌భుట్టోల ఎక్స్ అకౌంట్లను మనదేశంలో నిలిపివేశారు. ఏప్రిల్ 22న పహల్గాం దాడి తర్వాత పాక్‌కి, భారత్‌కి మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలోనే చట్టపరంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. వీరిద్దరివి మాత్రమే కాకుండా పలువురు పాకిస్తాన్ నటుల ఎక్స్ ఖాతాలు కూడా బ్లాక్ చేశారు. వారిలో ప్రముఖ నటులు హనియా అమీర్, మహిరా ఖాన్, అలీ జాఫర్‌ల ఎక్స్ ఖాతాలు ఉన్నాయి. సనమ్ సయీద్, బిలాల్ అబ్బాస్, ఇక్ర అజీజ్, ఇమ్రాన్ అబ్బాస్, సజల్ అలీ వంటి నటుల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను కూడా నిలిపివేశారు.

ఇజ్రాయిల్ దాడుల్లో 40 మంది మృతి

- గాజాలో ఆకలి మరణాలే అధికం

గాజా : గాజాపై ఇజ్రాయిల్ సైన్యం వరుస దాడులకు తెగబడుతోంది. ఇప్పటికే వేలాదిమంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. తాజాగా ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడుల్లో 40 మంది పాలస్తీనియన్లు మరణించారు. మరో 125 మంది గాయాలపాలయ్యారని గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది.

ఆకలి మరణాలే అత్యధికం

ఆకలికి తట్టుకోలేక మరెంతోమంది చనిపోతున్నారని మీడియా వెల్లడించింది. ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు సుమారు 3,500 మంది మృత్యువుకు చేరువలో ఉన్నారు. ఆహార, నిత్యావసర సరఫరాలను ఇజ్రాయిల్ సైన్యం అడ్డుకోవడంతో 2,90,000ల మంది చనిపోవడానికి సిద్ధంగా ఉన్నారని గాజా మీడియా తెలిపింది.

ఆర్మీ ట్రక్కు లోయలో పడి ముగ్గురు జవాన్ల మృతి

శ్రీనగర్ : ఇండియన్ ఆర్మీకి చెందిన ఓ ట్రక్కు జమ్ముకాశ్మీర్‌లోని రాంబన్ వద్ద లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. జమ్మూ నుంచి శ్రీనగర్‌కు వెళుతున్న ఆర్మీ వాహనం.. 'బ్యాటరీ చెష్మా' అనే ప్రదేశం వద్ద 600 అడుగుల లోయలోకి దొర్లిపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకొంది. ఆ వాహనంలో ప్రయాణిస్తున్న జవాన్లు చనిపోయినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. మరణించిన సైనికులను అమిత్ కుమార్, సుజిత్ కుమార్, మన్ బహదూర్‌గా గుర్తించినట్లు సైన్యం వెల్లడించింది. సహాయక చర్యలు చేపట్టేందుకు పోలీస్, ఆర్మీ, ఎస్‌డీఆర్ఎఫ్, సివిల్ క్యూఆర్టీ బందాలు రాంబన్‌కు బయల్దేరినట్లు అధికారులు వెల్లడించారు.

లధక్‌లోని ఆర్మీ క్యాంపులో అగ్ని ప్రమాదం

కేంద్రపాలిత ప్రాంతం లధక్‌లోని ఓ ఆర్మీ క్యాంపులో అగ్ని ప్రమాదం సంభవించింది. లేహ్ పట్టణంలోని డిగ్రీ కాలేజీ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అగ్ని కీలలు ఎగిసిపడటంతో అప్రమత్తమైన ఆర్మీ జవాన్లు ఆర్మీలోని అగ్నిమాపక విభాగానికి సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుని కొన్ని గంటలసేపు శ్రమించి మంటలను ఆర్పేశారు. ఆర్మీ అధికారులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని చెప్పారు.

ఫలితాల తేదీ ఇంకా ఖరారు కాలేదు : సిబిఎస్ఇ

న్యూఢిల్లీ : సిబిఎస్ఇ 10, 12వ తరగతి ఫలితాల కోసం దేశ వ్యాప్తంగా దాదాపు 42లక్షల మందికి పైగా విద్యార్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. అయితే ఈ నెల 6న ఉదయం 11గంటలకు సిబిఎస్ఇ 10, 12వ తరగతి ఫలితాలు విడుదల చేస్తున్నట్లు బోర్డు పేరిట ఒక సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుంది. దీనిన్ని సిబిఎస్ఇ ఖండించింది. ఆ లేఖ నకిలీదని, దాన్ని తాము విడుదల చేయలేదని సిబిఎస్ఇ స్పష్టం చేసింది. బోర్డు ఫలితాల విడుదలకు సంబంధించి అధికారిక ప్రకటన ఏదీ తాము విడుదల చేయలేదని బోర్డు తేల్చి చెప్పింది. ధ్రువీకరణ కాని వార్తల్ని షేర్ చేయవద్దని, సరైన సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థులను కోరింది.మన దేశంలో 7,842 కేంద్రాలు, మరో 26 దేశాల్లో నిర్వహించిన సిబిఎస్ఇ 10, 12వ తరగతి పరీక్షలకు దాదాపు 42లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 24.12 లక్షల మంది పదో తరగతి పరీక్షలు, 17.88లక్షల మంది 12వ తరగతి పరీక్షలు రాశారు. ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 4 మధ్య సిబిఎస్ఇ 10, 12వ తరగతి పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే.

ఎసిబి వలలో రాజస్థాన్ ఎమ్మెల్యే

జైపూర్ : రాజస్థాన్‌లోని బగిడోరా ఒక సిట్టింగ్ ఎమ్మెల్యేను అవినీతి నిరోధక బ్యూరో (ఎసిబి) ఆదివారం అరెస్టు చేయడం సంచలనంగా మారింది. భారత ఆదివాసీ పార్టీ (బిఎపి) ఎమ్మెల్యే జైకృష్ణ పటేల్ జైపూర్‌లోని తన అధికార నివాసంలో ఒక మైనింగ్ యజమాని నుంచి రూ 20 లక్షల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడినట్లు ఎసిబి వెల్లడించింది. కరౌలి జిల్లాలోని తోడభీమ్ బ్లాక్‌లోని కొన్ని మైనింగ్ లీజులకు సంబంధించిన మూడు ప్రశ్నలను గత అసెంబ్లీ సమావేశాల్లో అడగనందుకు మైనింగ్ యజమాని నుంచి ఎమ్మెల్యే మొత్తంగా రూ.10 కోట్లను డిమాండ్ చేశారు.

కెనరా బ్యాంక్ Canara Bank — ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. మెస్సర్స్ శ్రీ సన్‌ఫ్లవర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రాతినిధ్యం వహిస్తున్నవారు సెక్రటరీ & కరెస్పాండెంట్ మహాలి దయిత వెంకట శివ రామ పున్నం రాజు, డి.నెం.5-73/1, 5వ వార్డు, చల్లపల్లి-521126, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్.
2. శ్రీ మహాలి దయిత వెంకట శివ రామ పున్నం రాజు, తండ్రి : వెంకట రాజు, కోసూరు గ్రామం, మొవ్వ మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్.
3. శ్రీ మహాలి దయిత వెంకట శివ రామ పున్నం రాజు, తండ్రి : వెంకట రాజు, కోసూరు గ్రామం, మొవ్వ మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521150.
4. శ్రీ కుదరవల్లి పూర్ణానంద దాస్, తండ్రి : సీతారామయ్య, ప్రిన్సిపల్, శ్రీ శారద సన్‌ఫ్లవర్ జూనియర్ కాలేజ్, సన్‌ఫ్లవర్ కాలనీ, చల్లపల్లి, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521126.
5. శ్రీమతి మహాలి లక్ష్మి రాజేశ్వరి, భర్త : మహాలి దయిత వెంకట శివ రామ పున్నం రాజు, కోసూరు గ్రామం, మొవ్వ మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521150.
6. శ్రీ బోరుకాటి లక్ష్మణ రాజు, తండ్రి : లేటు బి. రత్తయ్య, కోసూరు గ్రామం, మొవ్వ మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521150.
7. శ్రీ మహాలి జె వి పవన్, తండ్రి : మహాలి దయిత వెంకట శివ రామ పున్నం రాజు, కోసూరు గ్రామం, మొవ్వ మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521150.
8. శ్రీ దళపతిరావు సురేష్ బాబు, తండ్రి: కృష్ణం రాజు, కోసూరు గ్రామం, మొవ్వ మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521150.
9. శ్రీ దళపతిరావు రామకృష్ణ రాజు, తండ్రి: కృష్ణం రాజు, కోసూరు గ్రామం, మొవ్వ మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521150.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ రూల్స్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి నోటీసు.

కెనరా బ్యాంక్, ఎఆర్‌ఎమ్ బ్రాంచ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) సెక్షన్ 13(8) క్రింద చదవబడు రూల్ 8(6) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 రూల్స్ (ఇక మీదట "రూల్స్"గా రిఫర్ చేయబడును) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత/సంస్థ, తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) వారిని లోను అకౌంట్ **మెస్సర్స్ శ్రీ సన్‌ఫ్లవర్ ఎడ్యుకేషనల్ సొసైటీ** కు సంబంధించిన బకాయి **రూ. 9,88,05,228/- (అక్షరాల తొమ్మిది కోట్ల ఎనభై ఎనిమిది లక్షల ఐదు వేల రెండు వందల ఇరవై ఎనిమిది రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ సెక్యూర్డ్ క్రెడిటార్ **చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద 16.01.2017 తేదిన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత/సంస్థ తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున **కెనరా బ్యాంక్, లబ్బీపేట** [illegible]

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు

[illegible]

తేది: 30.04.2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

మామిడి పండు

మామిడి చెట్టుకు కాస్తుంది మామిడికాయ
అది మాగితే అవుతుంది మామిడి పండు
మామిడి పండు రకరకాలుగా ఉంటుంది.
మామిడి పండు తింటే తీయగా నుండు
కారం, ఉప్పుతో కాయ మంచిగా ఉండు
ఉగాది రోజు పచ్చడిగా నూరుతారు
మామిడి పండు జ్యూస్ శక్తిని ఇచ్చు
మామిడి పండు మన జాతీయ ఫలం
అందరూ ఇష్టపడతారు మామిడి పండును.

- కె. అశ్వద్,
6వ తరగతి,
జి.ప.ఉ.పా. నర్సింహులపల్లి,
పెద్దపల్లి జిల్లా.

భరత నాట్యం



అనంతవరంలో రమ్య అనే అమ్మాయి ఆరవ తరగతి చదువుతోంది. తనకు చదువుతో పాటు భరత నాట్యం అంటే చాలా ఇష్టం. పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాల్లో భరత నాట్యం చేయాలని రమ్య కోరిక. అందుకోసం ఇంట్లో అమ్మ వద్ద భరత నాట్యం నేర్చుకుంది. రమ్యకున్న ఆసక్తిని గమనించిన క్లాస్ టీచర్ ఉగాది కవి సమ్మేళనం కార్యక్రమంలో భరత నాట్యం ప్రదర్శించే అవకాశం ఇప్పిస్తామని చెప్పారు. రమ్య సంతోషానికి హద్దు లేదు. ఎప్పుడెప్పుడు నాట్యం చేస్తానా అని ఎదురుచూసింది.

అయితే, ఉగాది కవి సమ్మేళనం అనుకోకుండా రద్దయింది. రమ్య చాలా బాధపడింది. అప్పుడు క్లాస్ టీచర్, 'అనుకున్నది జరగలేదని బాధపడవద్దు. ఏది జరిగినా మన మంచికే అనుకోవాలి. నిరుత్సాహ పడవద్దు. నాట్యం మరింత సాధన చేయాలి' అన్నారు. రమ్య సరే అంది. పరీక్షల కోసం శ్రద్ధగా చదువుకుంటూనే ఖాళీ సమయం దొరికినప్పుడు భరత నాట్యం ప్రాక్టీసు చేసింది.

కొన్ని రోజుల తర్వాత పాఠశాలలో వార్షికోత్సవం జరిగింది. ఆ రోజు పాఠశాల వేదికపై రమ్య భరత నాట్యం చేసింది. అది చూసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అందరూ రమ్యను మెచ్చుకున్నారు. ముఖ్య అతిథిగా వచ్చిన డీఈవో రమ్యను అభినందించి ఒక బహుమతిని బహుకరించారు.

- బి.రవిత్రేయని
ఆరవ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.
అనంత సాగర్,సిద్దిపేట జిల్లా



బొమ్మల కొలువు

హెడావ్ శ్రావణి,
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
లక్ష్మీపూర్,
ఆదిలాబాద్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com వాట్సాప్ : 83329 25496

జీవన సౌరభం

విలువైన ఆలోచనలు ఉన్నవాడు
జీవితంలో ఎన్నటికీ
ఒంటరివాడు కాడు.

మనసును తాకే మాటల రచయిత

టాలీవుడ్‌లో ఆయన పేరు తెలియని వారుండరు. ముఖ్యంగా డైలాగులు రాయటంలో ఆయన దిట్ట. పంచ్ డైలాగులు విసిరితే థియేటర్లలో మోత మోగాల్సిందే. చిన్న హీరోల నుంచి పెద్ద హీరోల వరకూ అందరూ ఆయనే మా సినిమాకు డైలాగులు రాయాలని కోరుకుంటుంటారు. ఆయనే బుర్రా సాయిమాధవ్. చిరంజీవి, బాలకృష్ణ, పవన్ కళ్యాణ్; నాగార్జున, ఎన్టీఆర్, రామ్‌చరణ్, మహేష్‌బాబు ... ఇలా కథానాయకులు అందరూ ఆయన్నే కోరుకుంటారు.

గుంటూరు జిల్లా తెనాలికి చెందిన బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి, జయలక్ష్మి దంపతులకు డిసెంబర్ 16, 1973లో బుర్రా సాయి మాధవ్ జన్మించారు. ప్రముఖ రంగ స్థల నటులు, రచయిత, సినిమా సంభాషణల రచయితగా ఆయన గుర్తింపు పొందారు. తల్లిదండ్రులు ఇద్దరూ రంగ స్థల కళాకారులే. ఆరు సంవత్సరాల వయసులోనే 'హరిశ్చంద్ర' నాటకంలో లోహితాశుడు పాత్రలో నటించారు సాయి మాధవ్. హైస్కూలు విద్యను అభ్యసించే సమయంలో నాటకాల్లో నటించి అందరి ప్రశంసలు పొందారు. 'మయసభ ధుర్యోధన' ఏకపాత్రాభినయంలో మంచి పేరు పొందారు. అనంతరం తన మిత్రులతో కలిసి 'అభ్యుదయ కళా సాహితి' అనే సంస్థను స్థాపించారు. అనతికాలంలోనే 'కళ్లు' అనే నాటికను ప్రదర్శించారు.

2019లో 'కళల కాణాచి' అనే సాంస్కృతిక సంస్థను స్థాపించి నాటక రంగానికి అనితరసాధ్యమైన సేవలు అందిస్తున్నారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం)లోనూ కీలక భూమిక పోషిస్తున్నారు. గడియారం, అమ్మకానికి అబ్బాయి, ఈనాడు, వరవిక్రయం, చరిత్ర పుటల్లో చెరగని మరకలు వంటి నాటకాల్లో నటించారు. దుర్యోధనుడు, అల్లూరి సీతారామరాజు ఏకపాత్రల్లో మెప్పించారు.

సినీరంగ ప్రవేశం

రంగస్థలం నుంచి సినిమా రంగంలోకి ప్రవేశించి సినిమాల్లో నటించటమే కాకుండా పాటలు, సంభాషణలు రాస్తున్నారు. ఆయన మాటలు రాసిన కంచె, మహానటి సినిమాలు జాతీయ అవార్డులను సైతం గెల్చుకున్నాయి. ఆర్ఆర్ఆర్ జాతీయ ఉత్తమ చిత్రంగా నిలిచి, ఆ చిత్రం మాటలు రచయితగా సాయిమాధవ్‌కు మంచి గుర్తింపునిచ్చింది. నటుడిగా రెండో కృష్ణుడు, బాలప్రపంచం, గుంటూరు గుండమ్మ కథ, గోపాలా గోపాల, గౌతమిపుత్ర శాతకర్ణి, మహానటి, ఎన్టిఆర్ కథానాయకుడు, ఎన్టిఆర్ మహానాయకుడులో నటించారు. పాటల రచయితగా తాళికట్టు శుభవేళ (మూడు పాటలు), హైటెక్ స్టూడెంట్స్ (అన్ని పాటలు), శ్రీ సత్యనారాయణస్వామి (మూడు పాటలు), కృష్ణం వందే జగద్గురుం (రెండు) కూడా పనిచేశారు. గౌతమిపుత్ర శాతకర్ణి (కథాగానం) చేశారు.

కృష్ణం వందే జగద్గురుం, గోపాల గోపాల, మళ్లీ మళ్లీ ఇది రాని రోజు, కంచె, రాజుగారి గది, దొంగాట, సర్దార్ గబ్బర్‌సింగ్, గౌతమిపుత్ర శాతకర్ణ, ఖైదీ నంబర్ 150, కిట్టుగాడు ఉన్నాడు జాగ్రత్త, మనస్సుకి నచ్చింది, మహానటి, సాక్ష్యం, శరభ, ఎన్‌టిఆర్ కథానాయకుడు, ఎన్‌టిఆర్ మహానాయకుడు, సైరా నరసింహారెడ్డి, ఆర్ఆర్ఆర్, శ్రీకారం, గమనం, క్రాక్, ది వారియర్, కల్కి 2898 ఏడీ, వీరసింహారెడ్డి వంటి 30కిపైగా సినిమాలకు మాటలు రాశారు.

బుల్లితెరపైనా వెలుగులు

టెలీఫిల్మ్‌లో నటుడిగా సీతాలు చదువు, కొస మెరుపులు, అమ్మకానికో అబ్బాయి, గ్రీటింగ్‌కార్డు, పొదరిల్లు, చీకట్లో చిరుదీపాలులో నటించారు. మాటలు రచయితగా అభినంద, అనంతం, మనసు చెప్పిన మాటకు కథ, టెలిప్లే, మాటలు, దర్శకత్వం వహించారు. సీరియల్స్‌లో కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, మాటలను పుత్తడి బొమ్మ, శిఖరం, నవ్వు నవ్వు, సంబరాల రాంబాబు, కళ్యాణ తిలకంకు మాటలు, పాటలు అందించారు. రాధాకళ్యాణానికి స్క్రీన్‌ప్లే, మాటలు అందించారు. సీతామహాలక్ష్మి, సిఎం ఎఎం టూ పిఎంకు మాటల రచయితగా వ్యవహరించారు.

క్రిష్ ప్రోత్సాహంతోనే...

కృష్ణం వందే జగద్గురుమ్'తో సాయిమాధవ్‌ను డైరెక్టర్ క్రిష్ ఇండస్ట్రీకి పరిచయం చేశారు. ఆ తర్వాత 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు' సినిమాలో రాసిన డైలాగులు విశేషంగా ఆకట్టుకున్నాయి. 'గోపాల గోపాల' సినిమాలో అర్థవంతమైన మాటలు రాసి ఔరా అనిపించారు. వెంటనే సర్దార్ గబ్బర్ సింగ్‌కు అవకాశం లభించింది. ఆ సమయంలోనే చిరంజీవి 150వ సినిమా ఖైదీ నంబర్ 150, బాలయ్య 100వ సినిమా గౌతమీపుత్ర శాతకర్ణి సినిమాలకు పాటలు రాసే అరుదైన అవకాశాన్ని అందుకున్నారు. ఏడాదికి డజనుకుపైగా సినిమాలకు ఆయన డైలాగులు రాస్తున్నారు.ప్రస్తుతం చిరంజీవి, పవన్‌కళ్యాణ్, రామ్‌చరణ్, బాలకృష్ణ సినిమాలకు డైలాగులు రాయటంలోనూ, మరెన్నో లేటెస్ట్ ప్రాజెక్టుల్లో ఆయన బిజీగా ఉన్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు

తెలుగు సినిమా ఖ్యాతిని మరింత పెంచేలా ...

తెలుగు సినీ పరిశ్రమలో నందమూరి తారక రామారావు రికార్డులు అన్నీ ఇన్నీ కావు. ఆయన నటన అన్నా, డైలాగుల డెలివరీ అన్నా నాకెంతో ఇష్టం. రచయితగా, కళాకారుడిగా నాకున్న పరిజ్ఞానం ప్రకారం డైలాగులు, మాటలను సినిమాలకు రాస్తున్నా. ఆర్ఆర్ఆర్ సినిమాలో నా డైలాగులకు మంచి గుర్తింపు రావటం ఎంతో సంతోషదాయకం. ఇది నా బాధ్యతను మరింతగా పెంచింది. తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లటానికి నా వంతుగా కూడా కృషిచేస్తా.

- డాక్టర్ బుర్రా సాయి మాధవ్,
మాటల రచయిత

మనసును తాకే డైలాగులు

రెండు దశాబ్దాలుగా తెలుగు సినిమాల్లో సాయి మాధవ్ రాసిన డైలాగులు బాగా పాపులర్ అయ్యాయి. ఇప్పుడు లీడింగ్ రైటర్‌గా గుర్తింపు పొంది సరికొత్త డైలాగులతో దూసుకుపోతున్నారు. **'సమర్థులు బయటికి రానంటూ ఇంట్లోనే ఉండిపోతే... అసమర్థులే రాజ్యమేలుతుంటారు మిత్రమా'. 'కార్పొరేట్ బీర్లు తాగిన బాడీ మీది. కార్పొరేషన్ నీళ్లు తాగిన బాడీ నాది'. 'దొరికిన వాన్ని తరుముదాం.. దొరకని వాన్ని తురుముదాం.. ఏదేమైనా దేశం మీసం మెలేద్దాం'** .. ఇలాంటి అద్భుతమైన మాటలు రాసింది ఆయనే. ప్రపంచ రికార్డులు కొల్లగొట్టిన ఆర్ఆర్ఆర్ మూవీలో డైలాగులు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. **'నా తమ్ముడు గోండు బెబ్బులి కొమురం భీం..! ప్రాణం కన్నా విలువైన.. నీ సోపతి నా సొంతం అన్నా... గర్వంతో ఈ మన్నులో కలిసిపోతానే...!', 'తొంగి తొంగి.. నక్కి నక్కి గాదే... తొక్కుకుంటూ పోవాలే... ఎదురొచ్చిన వాడిని ఏసుకుంటూ పోవాలే..."** అంటూ సాగే డైలాగులు బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయి.

పద్మభూషణుడికి ఘనంగా పౌర సన్మానం

- హాజరైన మంత్రి సవిత, ఎంపి, ఎమ్మెల్యేలు
- బాలయ్య డైలాగులతో అదరగొట్టిన మాజీ మంత్రి పల్లె

ప్రజాశక్తి-హిందూపురం (శ్రీసత్యసాయి జిల్లా)

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని ఎంజిఎం పాఠశాల మైదానంలో ఎమ్మెల్యే, సినీహీరో నందమూరి బాలకృష్ణకు పౌర సత్కార కార్యక్రమం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో సత్కరించిన నేపథ్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత, ఎంపి పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు కందికుంట ప్రసాద్, పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడారు. హిందూపురం నియోజకవర్గాన్ని నందమూరి నియోజకవర్గంగా తీర్చిదిద్ది, నందమూరి పురంగా మార్చిన ఘనత బాలకృష్ణకే దక్కుతుందన్నారు. సినీ, రాజకీయ రంగంలో తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టారన్నారు. తన తల్లి పేరుతో స్థాపించిన బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి చైర్మన్‌గా ఉంటూ ఎంతోమందికి ప్రాణదానం చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథ్‌రెడ్డి బాలకృష్ణ డైలాగులతో అదరగొట్టారు. అనంతరం వేలాదిమంది అభిమానుల నడుమ పద్మభూషణుడు నందమూరి బాలకృష్ణ దంపతులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు శ్రీకంఠాపురం నుంచి సభా వేదిక వరకు నందమూరి బాలకృష్ణ తన సతీమణి వసుంధరదేవితో కలిసి గుర్రపు బండిలో ఊరేగింపుగా సభా ప్రాంగణానికి చేరుకొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు వివిధ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

హెచ్‌డి రూపం... పైరసీలో కొత్త ప్రమాదం

హిట్3..తండేల్...గేమ్‌ఛేంజర్.. పైరసీ... పైరసీ...పైరసీ..సినిమా ప్రపంచాన్నే గడగడలాడిస్తూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్న ఉపద్రవంగానే చెప్పొచ్చు. అటు హాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకూ.. దేశంలోనూ అన్ని ప్రాంతాల్లోని సినిమా పరిశ్రమల్లో ఇదొక భూతంగా మారి పోయింది. కొత్త సినిమా విడుదలైన నాలుగైదు గంటల్లోనే సినిమా హెడ్‌డి కాపీలు సామాజిక మాధ్యమాల్లో సాక్షాత్కరిస్తున్నాయి. బాలీవుడ్‌లో తీవ్ర దుమారాన్నే రేపుతోంది. గురువారం విడుదలైన హిట్ 3 మూవీ కూడా పైరసీకి గురైంది. కొన్ని గంటల్లోనే హెడ్‌డి ప్రింట్ కాపీ ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టడంతో ప్రేక్షకులు థియేటర్లకు వెళ్లకుండానే చూసేస్తున్నారు. హైలెవల్ డిజిటల్ కాపీ మంచి క్వాలిటీతో వస్తుండటంతో అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు. పైరసీ చేసినా, చూసినా నేరమేనని అందరికీ తెలుసు. కానీ థియేటర్లకు వెళ్తే వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొనటంతో ఏదో ఒక రూపంలో వినోదాన్ని అందించే పైరసీ కూడా ఖర్చుతగ్గిస్తుందనే భావన కొందరిలో ఉంది. ఏకాఏకీన చెప్పుకుంటూ వస్తే పైరసీ భూతం ఎవరు తయారు చేసినా నష్టపోతున్నది మాత్రం నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, థియేటర్ల యజమానులు. అన్నింటికన్నా ముఖ్యమైన విషయం నటీనటులు. పైరసీని ముందే గ్రహిస్తున్న కొందరు నిర్మాతలు సినిమా హిట్టా, పట్టా అనేది తేలిన తర్వాత పూర్తి పేమెంట్లు ఇస్తామంటూ కొంత కురదలా బకాయిలు ఉంచుతున్నారు. హిట్టయితే మిగతా పేమెంట్లు ఇస్తాం.. పట్టయితే ఇక సరిపెట్టుకోవాల్సిందేనంటూ నిర్మాతలు కూడా కొందరు నటీనటులతో ముందే ఒక అంగీకారానికి వస్తున్న పరిస్థితులు కూడా ఉంటున్నాయి. పైరసీ కేవలం ఆర్థిక నష్టాన్ని మాత్రమే కాక, సినిమా నిర్మాణంలో పాల్గొన్న వేలాదిమంది కళాకారులు, సాంకేతిక నిపుణుల కృషిని దెబ్బతీస్తోంది.

పరిశ్రమకే పెద్ద సవాల్

ఒక సినిమా బయటకు రావాలంటే వందలాది మంది సమిష్ట కష్టం. కొన్ని లక్షల మందికి ఉపాధిని కల్పిస్తున్న అతిపెద్ద రంగం కూడాను. ఫలితం ఎలా ఉంటుందో తెలియకుండానే నిర్మాత వందలాది కోట్ల రూపాయలతో ఆడే ఒక రిస్కీగేమ్ ఈ సినిమా. ఒక సినిమా విడుదలవ్వాలంటే ఒక్కోసారి రెండు నుంచి మూడేళ్లపాటు రక్తాన్ని, చెమటను, అంతకుమించి హార్డ్‌వర్క్‌ని ధార పోయాల్సివుంటుంది. ప్రస్తుతం సినిమాలన్నీ డిజిటల్ రూపంలోనే ఉంటున్నాయి. ఫిల్మింగ్, ఎడిటింగ్ నుంచి ఫైనల్ కాపీ వరకూ ఎక్కడైనా లీక్ అయ్యే అవకాశం ఉంది. మూడు గంటల సినిమా కోసం మూడేళ్లు కష్టపడి తీస్తే.. పైసా ఖర్చు లేకుండా దాన్ని కొందరు పైరసీలో చూసేస్తూ వినోదాన్ని పొందుతున్నారు. క్యూబ్ లాంటి ఫ్లాట్‌ఫామ్‌ల ద్వారా డిజిటల్ రూపంలో సినిమాలు థియేటర్లకు చేరుతుండటం అక్కడ కూడా లీకులు అవుతున్నాయి.

సోషల్ మీడియా పుణ్యమే?

ఈ పైరసీ భూతానికి అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని పరిశ్రమ నిపుణులు సూచిస్తున్నారు. ఒకప్పుడు ఇంటర్నెట్ అందరికీ అందుబాటులో లేని సమయంలో కొత్త సినిమాలను వీడియో క్యాసెట్ల రూపంలో విడుదల చేసేవారు. వీటికి విపరీతమైన డిమాండ్ ఉండేది. ఆ తర్వాత కాలంలో సీడీలు వచ్చాయి. వాటికీ డిమాండ్ ఉండేది. ఇంటర్నెట్ వచ్చిన తర్వాత సోషల్ మీడియా ద్వారా పైరసీ సులభమైపోయింది. ఇంటర్నెట్ ఉంటే చాలు కొత్త సినిమాలను అందించే 'ఐబొమ్మ' లాంటి వెబ్‌సైట్లు ఎన్నో పుట్టుకొచ్చాయి. గతంలో క్యాసెట్లు, సీడీలు ఉన్న సమయంలో పైరసీ చేయాలంటే వాటిని కాపీలు తీయాల్సివచ్చేది. దీనికి సమయం పట్టేది. సరిగా మాట వినకపోవటం, బొమ్మ స్పష్టత సరిగా ఉండకపోయే సరికి పెద్దగా ఆదరణ ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఒక్క కాపీని సోషల్ మీడియాలో పెడితే చాలు.. నిమిషాల్లో వేల సంఖ్యలో డౌన్‌లోడ్ అయిపోతుంది. ఆ తర్వాత గ్రూపుల ద్వారా లక్షలాది మందికి చేరుతుంది.

కొత్త సినిమాలన్నింటికీ ఇదే ప్రమాదం

గేమ్‌ఛేంజర్' సినిమా విడుదలైన ఆరుగంటల్లోనే ఈ చిత్రం హెడ్‌డీ ప్రింట్‌ను ఇంటర్నెట్‌లో ఉంచారు. ఆ తర్వాత ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, వాట్సాఫ్ లాంటి మాధ్యమాల ద్వారా ఎన్నో లక్షలాది మందికి అతితక్కువ గంటల్లోనే చేరిపోయింది. అత్యంత డిజాస్టర్ మూవీగా నిలిచిపోవటానికి పైరసీనే కారణం. సంక్రాంతికి వస్తున్నాం, డాకుమహారాజ్, తండేల్ లాంటి సినిమాలన్నింటినీ ఈ పై పైరసీ భూతమే మింగేయటానికి చూసింది. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి సినిమాలు తీసే నిర్మాతలు ఆశించేది మొదటి వారం కలెక్షన్లు. వీటిని ఈ పైరసీ భూతం దారుణంగా దెబ్బతీస్తోంది.

ఉత్కంఠ పోరులో కెకెఆర్ విజయం

చివరిబంతి వరకూ ఉత్కంఠభరితంగా సాగినమ్యాచ్‌లో కోల్‌కత నైట్ నైడర్స్(కెకెఆర్) జట్టు ఘనవిజయం సాధించింది. చివరి బంతికి మూడు పరుగులు చేయలేక రాజస్తాన్ రాయల్స్ విజయానికి దూరమైంది. కెకెఆర్ కేవలం ఒక్క పరుగు తేడాతో గెలుపొందింది. రాజస్తాన్ ఇలాంటి టైట్ మ్యాచ్‌లో ఓడిపోవడం ఈ సీజన్‌లో ఇది మూడోసారి. రియాన్ పరాగ్ (95) అద్భుత ఇన్నింగ్స్‌తో సత్తా చాటినా రాజస్తాన్ చివరకు విజయం సాధించలేకపోయింది. దీంతో కోల్‌కతా నైట్ రైడర్స్ విజయాన్ని అందుకుని ప్లే ఆఫ్స్‌కు చేరే అవకాశాలను మెరుగుపరుచుకుంది.

ఈడెన్ : ఆదివారం ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్తాన్ రాయల్స్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ అజంక్య రహానే బ్యాటింగ్ ఎంచుకున్నాడు. బ్యాటర్లందరూ తమ వంతు పాత్ర పోషించి పరుగులు చేయడంతో కోల్‌కతా నైట్ రైడర్స్ ప్రత్యర్థి ముందు భారీ టార్గెట్ ఉంచింది. ఆండ్రూ రస్సెల్ (57) హాఫ్ సెంచరీ చేశాడు. ఓపెనర్ గుర్బాజ్ (35), కెప్టెన్ రహానే (30), రఘువంశీ (44) కీలక ఇన్నింగ్స్ ఆడారు. దీంతో కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది. రాజస్తాన్ బౌలర్లలో ఆర్చర్, యుద్వీర్ సింగ్, తీక్షణ, రియాన్ పరాగ్ ఒక్కో వికెట్ తీశారు.

207 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్తాన్ ఆరంభంలోనే కీలక వికెట్లు కోల్పోయింది. 71 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో రియాన్ పరాగ్ (95) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి జట్టును గెలిపించే ప్రయత్నం చేశాడు. అతడికి హెట్ మెయర్ (29) సహకరించాడు. అయితే పరాగ్ అవుటైన తర్వాత కోల్‌కతా పట్టు బిగించింది. అయితే చివర్లో శుభమ్ దూబె (25) కేకేఆర్‌ను భయపెట్టాడు. బౌండరీలతో విరుచుకు పడ్డాడు. చివరి బంతికి మూడు పరుగులు చేయాల్సిన దశలో కేవలం సింగిల్ మాత్రమే చేశాడు. దీంతో ఆర్ఆర్ ఒక్క పరుగు తేడాతో ఓడిపోయింది. 20 ఓవర్లలో 205 పరుగులు మాత్రమే చేసింది. కోల్‌కతా బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, మొయిన్ అలీ రెండేసి వికెట్లు తీశారు.

ముఖేష్‌కు మరో రెండు బంగారు పతకాలు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

భోపాల్‌లో జరుగుతున్న 23వ కుమార్ సురేంద్ర సింగ్ మెమోరియల్ నేషనల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరు షూటర్ ముఖేష్ నేలవల్లి మరో రెండు స్వర్ణ పతకాలు సాధించాడు. 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ సీనియర్, జూనియర్ విభాగాలలో ముఖేష్ 600కు గాను 575 పాయింట్లు సాధించి రెండు స్వర్ణ పతకాలు గెలిచాడు. సీనియర్, జూనియర్ రెండు విభాగాలలో మధ్యప్రదేశ్‌కు చెందిన సురాజ్‌శర్మ 574 పాయింట్లతో రజత పతకాలు గెలవగా, సీనియర్ విభాగంలో హర్యానాకు చెందిన ఆదర్శ్ సింగ్ 573 పాయింట్లతో, జూనియర్ విభాగంలో రాజస్థాన్‌కు చెందిన యోగేష్ కుమార్ 567 పాయింట్లతో కాంస్య పతకాలు గెలుపొందారు. ఈ పోటీల్లో గత శుక్రవారం 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో కూడా ముఖేష్ స్వర్ణం గెలిచిన విషయం విదితమే.

ధర్మశాలలో దంచికొట్టిన పంజాబ్

- లఖ్‌నవూపై ఘన విజయం
- అదరగొట్టిన అర్షదీప్..
- చెలరేగిన ప్రభ్‌సిమ్రన్ సింగ్

అటు బ్యాటర్లు, ఇటు బౌలర్లు సమష్టిగా రాణించడంతో పంజాబ్ కింగ్స్ జట్టు ఘన విజయం సాధించింది. ఇప్పటివరకు ఒక్కసారి కూడా గెలవని ధర్మశాల మైదానంలో తొలి విజయాన్ని నమోదు చేసింది. పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరుకుంది. మరోవైపు కీలకమైన మ్యాచ్‌లో లఖ్‌నవూ ఆటగాళ్లు చేతులెత్తేశారు. ప్లే ఆఫ్స్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకున్నారు. మొదట ప్రభ్‌సిమ్రన్ సింగ్ (91), బౌలింగ్‌లో అర్షదీప్ (3/16) రాణించడంతో పంజాబ్ అద్భుత విజయం సాధించింది.

ధర్మశాల : ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో పంజాబ్ టీమ్ బ్యాటింగ్‌కు దిగింది. తొలి ఓవర్ లోనే ప్రియాంశ్ ఆర్యను అవుట్ చేసి ఆకాశ్ సింగ్ షాకిచ్చాడు. అయితే ఆ తర్వాత లఖ్‌నవూ బౌలర్లకు చుక్కలు కనిపించాయి. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (48 బంతుల్లో 91) తన ఫామ్‌ను కొనసాగిస్తూ మరో అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. అతడికి కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (45), జాస్ ఇంగ్లిస్ (30) సహకరించారు. చివర్లో శశాంక్ సింగ్ (33 నాటౌట్) కీలక పరుగులు చేశాడు. దీంతో పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 236 పరుగులు చేసింది. లఖ్‌నవూ బౌలర్లలో ఆకాశ్ సింగ్, దిగ్వేష్ రాఠీ రెండేసి వికెట్లు తీశారు.

237 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన లఖ్‌నవూ టీమ్ ఏ దశలోనూ విజయం సాధించేలా కనిపించలేదు. కనీస పోటీ కూడా ఇవ్వలేదు. పంజాబ్ బౌలర్ అర్షదీప్ ధాటికి మార్క్రమ్, మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్ స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. రిషభ్ పంత్ (18), డేవిడ్ మిల్లర్ (11)లను ఒమర్జాయ్ పెవిలియన్ చేర్చాడు. ఆయుష్ బదోనీ (40 బంతుల్లో 74) కీలక ఇన్నింగ్స్‌తో పోరాటం చేశాడు. అబ్దుల్ సమద్ (45) కూడా రాణించాడు. చివరకు లఖ్‌నవూ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 199 పరుగులు మాత్రమే చేసింది. 37 పరుగులతో ఓటమి చవిచూసింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68